Postel No. MBN/08/2016-2018





# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :256 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు గురువారం 08 జనవరి 2026 పేజీలు :12 వేల రూ5 /-


## ఎన్నికలకు సిద్ధమవుతున్న

# పురపాలికలు

**రంగారెడ్డి, జనవరి 7:**మేడ్చల్ జిల్లాలో మున్సిపాలిటీలలో ఎన్నికల కొలాహలం మొదలైంది. జిల్లాలో ఎన్నికలు జరుగుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నప్పటికీ అధికారులు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లాలో కేవలం మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఇటీవల ఏర్పడ్డాయి.గతంలో జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్ లు, 9 మున్సిపాలిటీలో ఉండేవి. ఇవి రింగురోడ్డు లోపల, రింగ్ రోడ్డు ని ఆనుకొని ఉండడంతో ప్రభుత్వం ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. అంతకుముందు జిల్లాలోని గ్రామపంచాయతీలన్నీ



మున్సిపాలిటీలలో విలీనం చేసింది. రింగ్ రోడ్డు బయట ఉన్న గ్రామాలను కలిపి ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నందున ఇవి కూడా జిహెచ్ఎంసి లో కలుస్తాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండడంతో పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మూడు మున్సిపాలిటీలలో ఓటరు జాబితా ముసాయిదాలు వెల్లడించారు. ఓటరు జాబితా పై ఈ నెల 5 వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే రోజు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అభ్యంతరాలు, సలహాలు, - మిగతా3లో

## తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేలా

# సంక్రాంతి కార్యక్రమాలు



**హైదరాబాద్:** ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ల పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## 8 వేల కోట్లతో

# మంచినీటి సరఫరాకు ప్రణాళికలు

**హైదరాబాద్, జనవరి 7:**హైదరాబాద్ సిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా, అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు జలమండలి రూ. 8,000 కోట్ల భారీ వ్యయంతో ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరానికి నీటిని అందించే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా మరియు జంట జలశయాల (ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్) వనరులను ఒకే గొడుగు కిందకు తెస్తూ, నగరం చుట్టూ 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ప్రధాన పైపులైన్లు వేసి, దానికి అనుసంధానంగా మరో 96 కిలోమీటర్ల మేర అంతర్గత నెట్‌వర్క్‌ను నిర్మించడం ద్వారా నగరం నలుమూలలకూ నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారుగతంలో కేవలం జంట జలశయాలపై ఆధారపడిన నగరం, ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల నుండి నీటిని పొందుతోంది. అయితే, ఏదైనా ఒక ప్రధాన



పైపులైన్‌కు మరమ్మతులు జరిగినా లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఆయా ప్రాంతాల్లో సరఫరా - మిగతా3లో

# కార్నర్ లో కార్...

**హైదరాబాద్, జనవరి 7:**న్నమొన్నటి వరకు ఆమె టార్గెట్ హరీశ్‌రావు. అప్పుడప్పుడు కేటీఆర్‌పై అటాక్. మధ్యలో సంతోష్‌పై సెటైర్లు. కానీ ఇప్పుడు అక్క..డైరెక్ట్‌గా గులాబీ బాస్‌పైనే బాణాలు ఎక్కు పెడుతోంది. పెద్ద సార్ టార్గెట్‌గానే..ఇంకా చెప్పాలంటే కల్వకుంట్ల ఫ్యామిలీ లక్ష్యంగానే ఆమె రాజకీయ పోరాటం ఉండబోతుందన్నది చెప్పకనే చెప్పేస్తోంది. కానీ కవిత కామెంట్స్‌పై కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి మాత్రం నో రియాక్షన్. కవిత రోజు రోజుకు డోస్ పెంచుతున్నా బీఆర్ఎస్ కీలక నేతలెవరూ స్పందించడం లేదు. ఇదే ఇప్పుడు కారు పార్టీలో హాట్ టాపిక్‌గా మారుతోంది.కారులో ఉన్నప్పుడే అందరినీ కార్నర్ చేసింది. ఒక్క అధినేతను వదిలిపెట్టి..హరీశ్, కేటీఆర్, సంతోష్‌ను..వరుసపెట్టి అటాక్ చేస్తూ వచ్చింది కవిత. ఇక బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాక..ఆమె విమర్శల దాడి ఇంకా ఎక్కువైంది. ఎక్కడ్డిల్లినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులే టార్గెట్ గా ఆరోపణలు చేస్తూ వస్తున్నారు కవిత.అయినా హరీశ్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ ఆమె కామెంట్స్‌పై అస్సలు రియాక్ట్



కావడం లేదు. లేటెస్ట్ మండలి వేదికగా కవిత మాట్లాడిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ముఖ్యనేతలందరిపైనా - మిగతా3లో



## సంపాదకీయం

# కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్

అగ్రరాజ్యం అమెరికా విదేశీ ఉద్యోగులను తగ్గిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా వెళ్లాలని భావిస్తున్న ప్రయాణికులకు దిమ్మతిరిగే షాక్ ఇచ్చేలా టూరిస్ట్ వీసా ఫీజులను యూఎస్ భారీగా పెంచింది అన్న వార్తలు ఇప్పుడు హల్చల్ చేస్తున్నాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా భారతీయులు, విద్యార్థులు, పర్యాటకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక విదేశీ ఉద్యోగులపై కక్ష గట్టాడు. ముఖ్యంగా భారతీయులను వెళ్లగొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.నూతన సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ మార్పులు అమల్లోకి తీసుకువచ్చినట్లు చెప్తున్నారు. దీని ప్రకారం ఇప్పటివరకు 17 వేల రూపాయలు వీసా ఫీజుగా చెల్లిస్తే, ఇకపై 40వేల రూపాయలు వీసా ఫీజుగా చెల్లించాలి. కానీ ఇందులో కొంత ఉపశమనం ఇచ్చే వార్త కూడా యూఎస్ ప్రభుత్వం చెప్పింది, ఎవరైతే యూఎస్ వెళ్లి తిరిగి చెప్పిన సమయంలోనే తిరిగి వస్తారో వారికి వీసా ఇంటిగ్రిటీ ఫీజుగా వసూలు చేసే 250 డాలర్లు తిరిగి ఇస్తారని చెప్తున్నారు.అయితే యూఎస్ తాజా నిర్ణయం అయిన వీసా ఫీజుల పెంపుతో విదేశీ ప్రయాణ ఖర్చులు మరింత పెరిగే అవకాశముంది. ఇప్పటికే విమాన టికెట్లు, హోటల్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. ముఖ్యంగా అమెరికాకు టూరిజం, బిజినెస్, కుటుంబ సభ్యుల సందర్శన కోసం వెళ్లే వారికి ఈ నిర్ణయం ఇబ్బందికరంగా మారింది. డాలర్ డ్రీమ్స్! అమెరికాలో ప్రస్తుతం ఉత్పన్నం అవుతున్న పరిస్థితులు.. భారతీయ మిడిల్ క్లాస్ ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ విషయం అందరూ పదేపదే చర్చించుకుంటున్నారు. అయితే.. ఎందుకు ఆందోళన చెందాలి? అనేది ముందుగా మనం ఆలోచించాలి. అమెరికాలో ఉద్యోగాలు ఇక తగ్గిపోతాయనే భయం, అమెరికాకు చేసే ఎగుమతులు మందగిస్తాయనే భయం.. మిగిలిన యావత్ ప్రపంచాన్ని కూడా ఆందోళనకు గురిచేస్తుండవచ్చు. కానీ కొంచెం లోతుగా, భిన్నంగా ఆలోచిస్తే ఇవన్నీ కూడా అర్థం లేని భయాలే అనిపిస్తుంది. అధిక సంపాదన, అధిక లాభాలు.. ఇలా 'అధిక' అనే పదాన్ని పట్టించుకోకపోతే గనుక.. ఇక ఎవ్వరికీ ఏ చింతా లేదు. నిజానికి ఈ భయాలు మనం పరాధీనులుగా మారిపోతున్నామా అనే అనుమానాన్ని మనకు కలిగిస్తున్నాయి. అమెరికాలో చదువులకోసం లక్షలు కాదు కదా.. కోట్ల రూపాయలు అయినా ఖర్చు పెట్టడానికి మిడిల్ క్లాస్ కూడా సిద్ధమవుతున్నారు. అందరిలోనూ ఇప్పుడు ఆందోళనే.అమెరికాలో పై చదువుల కోసం వెళ్లే వారు నిజంగానే చదువు మీద శ్రద్ధతో వెళుతున్నారా? 'భారత దేశంలో దొరకని నాణ్యమైన విద్య నేర్చుకోవచ్చు' అనే నమ్మకంతో వెళుతున్న వారు ఎందరు? కనీసం ఒక్క శాతం అయినా కేవలం ఇక్కడ నేర్చిన విద్యను మరింత మెరుగుపరుచుకోవడానికి మాత్రమే అమెరికాకు వెళ్లి రావాలని అనుకునే వాళ్ళు ఉన్నారా? ఈ ప్రశ్నలకు ఉన్నారని జవాబు చెప్పడం చాలా కష్టం. అమెరికా చదువుల కోసం వెళుతున్న వారిని కదలిస్తే.. అక్కడి డాలర్ల సంపాదన గురించి.. ఇక్కడకు అక్కడకు సంపాదనలో ఉండే తేడా గురించిన ఆశ కనిపిస్తున్నదే తప్ప.. అక్కడి చదువులు తమను ఎంత పదును పెడుతున్నాయనే చర్చ ఎప్పటికీ ఉండదు.అమెరికాలో చదువుకోవడానికి వెళుతున్న విద్యార్థులు కూడా అన్ని రకాల నిబంధనలను అతిక్రమించి.. చిరుద్యోగాలు, కూలిపనులు చేసుకుంటూ డాలర్లు సంపాదించడానికి వెళ్లిన తొలిరోజునుంచి దృష్టి పెడుతుండడాన్ని కూడా మనం గమనినంచాలి. ట్రంప్ సుంకాలు విధించినప్పటినుంచి భారత్ నుంచి ప్రధానంగా ఫార్మా, ఆక్వా తదితర రంగాలు ప్రభావితం అవుతాయని అంతా అంచనా వేస్తూ వచ్చారు. ఈ రంగాలు దెబ్బతింటాయని, ఎగుమతులు తగ్గుతాయని, ఆ పరిశ్రమల మీద ఆధారపడిన వేలమంది జీవితాలు గందరగోళంలో పడతాయని రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తూ వస్తున్నాయి. అయితే ఈ రంగాలతో సంబంధం లేని, అమెరికా పరిణామాలతో సంబంధంలేని సగటు భారతీయుల వాదన మరోరకంగా వినిపిస్తూ ఉంటుంది.ఆక్వారంగమే తీసుకుందాం. అమెరికా ఎగుమతుల పుణ్యమాని.. వేల ఎకరాల సారవంతమైన పంట భూములు చేపల, రొయ్యల చెరువులుగా మారిపోయాయి. దీని వల్ల.. భూసారం దెబ్బతింటోంది. పర్యావరణానికి అనన్యమైన హాని జరుగుతోంది. భూగర్భజలాలు కూడా నాశనం అవుతున్నాయి. రకరకాల కాలుష్యాలు పెరుగుతున్నాయి. ఇదంతా పర్యావరణ వేత్తలు ఆక్వారంగం విశ్వరూపం గురించి వెలిబుచ్చే ఆవేదనలు. అదేసమయంలో సగటు వ్యక్తుల వాదన ఇంకోటి కూడా ఉంది. మన ఆక్వా ఉత్పత్తుల్లో అత్యంత నాణ్యమైన రొయ్యలను భారతీయ మార్కెట్ కు అస్సలు అందుబాటులో ఉంచకుండా పూర్తిగా ఎగుమతులు చేసేస్తున్నారనేది ఒక వాదన. ఇక్కడి నేలలను నిస్సారం చేస్తున్నారు.. ఇక్కడి వనరులను వాడుకుంటున్నారు. ఇక్కడి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. అంతా కలిపి వాటిని తినే భాగ్యం మాత్రం విదేశాలకే ఉండాలన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.. అని వారు వాదిస్తున్నారఇప్పుడు ఈ సుంకాలు ఆక్వా పరిశ్రమ మీద ప్రభావం చూపిస్తే.. ఆ రంగం తక్కువ నష్టాలతో బయటపడడానికి వేరే ప్రత్యామ్నాయమే లేదా? అనేది ప్రధానంగా ఆలోచించాల్సిన సంగతి. ఇతర దేశాలకు ఎగుమతులు చేసుకుంటే మాత్రమే అధిక లాభాలు దక్కుతాయా? భారతీయ మార్కెట్ ఎప్పటికీ.. తమ నాణ్యమైన రొయ్యలను కొనుగోలు చేసే శక్తితో లేదని వారు అనుకుంటున్నారా? అనేవన్నీ కూడా చర్చకు రావాల్సిన అంశాలే. ఏదిఏమైనప్పటికీ మోడీ చెప్పిన మాట నిజం. ఇతరులమీద ఆధారపడడం అనేదే మనకు అసలైన శత్రువు. రొయ్యల పరిశ్రమకు సంబంధించిన వారు కూడా స్వదేశీ మార్కెట్ ద్వారానే గరిష్టమైన లాభాలు సంపాదించుకోవడం ఎలాగో అన్వేషించగలిగిన నాడు.. ట్రంప్ కాదు కదా.. అంతకంటె బలమైన, అంతకంటె క్రూరమైన ప్రపంచ పాలకుడు మరొకడు అవతరించినా కూడా.. మనల్ని ఎలాంటి ఒత్తిడికి గురిచేయలేడు అనేది వాస్తవం.కొంచెం పచ్చిగా చెప్పుకోవాలంటే.. అక్కడ ఎమ్మె?స్ డిగ్రీ చేయడం అనేది.. అక్కడ ఉద్యోగం దొరకబుచ్చుకోవడం కోసం ఒక సాకు మాత్రమే. ప్రధాన లక్ష్యం.. సంపాదనే. ఆ క్లారిటీ అందరికీ ఉన్నది గనుకనే.. తొలినాటినుంచి సంపాదన మీద దృష్టిపెడుతూ వస్తున్నారు.ఈ క్రమంలో హెచ్?1బీ వీసా నిబంధనలు కఠినతరం చేశారు. వీసా ఫీజు రూ.లక్ష డాలర్లకు పెంచారు. తాజాగా వీసా కేటాయింపు ప్రక్రియలో ర్యాండమ్ లాటరీ వ్యవస్థను మార్చి, వేతనం, నైపుణ్యాల ఆధారంగా జారీ చేయాలని నిర్ణయించారు. ఈ మార్పులు ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురితమయ్యాయి. 2027 ఆర్థిక సంవత్సరం క్యాప్ రిజిస్ట్రేషన్ నుంచి అమలవుతాయి. ఇకపై అధిక వేతనాలు పొందే నిపుణులకు ఎంపిక అవకాశాలు గణనీయంగా పెరుగుతాయిఅమెరికా కార్మిక శాఖ, హెచ్?1బీ ఉద్యోగుల వేతనాలను నాలుగు లెవల్స్‌గా వర్గీకరించింది.ఎంట్రీ?లెవల్ వర్కర్లు ? ర్యాండమ్ లాటరీలో ఒక్కసారి మాత్రమే పాల్గొంటారు (ఛాన్స్ 15% తగ్గుతుంది)మధ్యస్థ నైపుణ్యం ? రెండుసార్లు ఎంపిక అవకాశం (31% ఛాన్స్).అధిక నైపుణ్యం ? మూడుసార్లు ప్రవేశం (46% అవకాశం).అత్యధిక వేతనం ? నలుసార్లు లాటరీలో పాల్గొనవచ్చు ( (61% ఎంపిక ఛాన్స్).హెచ్?1బీ/హెచ్?4 అపాయింట్‌మెంట్ ఆలస్యాలతో భారతీయ వలసదారులు ఇబ్బంది పడుతున్నారు. చట్ట ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు, జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. ట్రంప్ పరిపాలన అక్రమ వలసలను అరికట్టి, సరిహద్దులు, పౌరుల భద్రతకు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

# ఆర్థిక సంక్షోభంలోనూ వెనిజులా



**న్యూఢిల్లీ, జనవరి 7:**వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనలో ఆ దేశానికి చెందిన విలువైన బంగారు నిల్వలు భారీ ఎత్తున విదేశాలకు తరలిపోయినట్లు తాజా కస్టమ్స్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా 2013 నుంచి 2016 మధ్య కాలంలో సుమారు 5.20 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని వెనిజులా నుంచి స్విట్జర్లాండ్‌కు తరలించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి.నికోలస్ మదురో 2013లో వెనిజులా అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆ దేశ ఆర్థిక పరిస్థితి గందరగోళంలో పడింది. ఆ మూడేళ్ల కాలంలోనే దాదాపు 113 మెట్రిక్ టన్నుల స్వచ్ఛమైన బంగారాన్ని స్విట్జర్లాండ్‌కు తరలించారు. వెనిజులా సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న నిల్వల నుంచే ఈ బంగారం తరలిపోయినట్లు స్విస్ బ్రాడ్‌కాస్టర్ 'ఎస్ఆర్ఎఫ్ల ధ్రువీకరించింది. దేశ ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడానికి, నగదు లభ్యత కోసం ప్రభుత్వం ఈ బంగారాన్ని విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోనే గోల్డ్ రిఫైనింగ్‌కు స్విట్జర్లాండ్ ప్రధాన కేంద్రం కావడంతో.. అక్కడ శుద్ధి చేయడం, ధ్రువీకరణ పొందడం కోసం ఈ బంగారాన్ని పంపినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.యూరోపియన్ యూనియన్ వెనిజులాపై ఆంక్షలు విధించిన 2017 సంవత్సరం నుంచి ఈ ఎగుమతులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణలతో వెనిజులాకు చెందిన కీలక వ్యక్తులపై ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. స్విట్జర్లాండ్ కూడా 2018 ఆరంభంలో ఈ ఆంక్షలను స్వీకరించింది. వెనిజులా సెంట్రల్ బ్యాంక్ వద్ద నిల్వలు నిండుకోవడం వల్ల కూడా ఎగుమతులు ఆగిపోయి ఉండొచ్చని మార్కెట్ విశ్లేషకురాలు రోనా ఓ కానెల్ అభిప్రాయపడ్డారు.ఇటీవల జనవరి 3న కరాకస్‌లో జరిగిన ఆకస్మిక దాడిలో అమెరికా ప్రత్యేక దళాలు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకున్నాయి. ప్రస్తుతం ఆయన న్యూయార్క్ కోర్టులో డ్రగ్ ట్రాఫికింగ్, నార్కో-టెర్రరిజం వంటి తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం స్విట్జర్లాండ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మదురోతో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులైన మరో 36 మందికి సంబంధించిన ఆస్తులను స్విస్ బ్యాంకులు స్తంభింపజేశాయి. అయితే వెనిజులా సెంట్రల్ బ్యాంక్ నుంచి తరలిన బంగారానికి, ప్రస్తుతం ఫ్రీజ్ చేసిన ఆస్తులకు మధ్య ఉన్న సంబంధంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.వెనిజులా ప్రజలు తీవ్ర ఆకలితో, ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న సమయంలోనే ఇంత భారీ సంపద దేశం దాటడం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఆ బంగారం ఆసియా మార్కెట్లలో విక్రయించబడిందా లేక ఆర్థిక సంస్థల వద్దే ఉండిపోయిందా అనే కోణంలో దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి

# స్పైగా చిన్నపిల్లలు....

**ఢిల్లీ, జనవరి 7:**పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఇప్పుడు మైనర్ భారతీయ పిల్లలను లక్ష్యంగా చేసుకుంటోంది. గూఢచర్యం ఆరోపణలపై పఠాన్‌కోట్ పోలీసులు 15 ఏళ్ల బాలుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆ బాలుడు గత ఏడాది కాలంగా పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ నిర్వాహకులకు భారతదేశం గురించి సున్నితమైన, ముఖ్యమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. పక్కా సమాచారంతో బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పంజాబ్‌లోని ఇతర జిల్లాల్లోని ఇతర మైనర్లతో పాటు ఈ బాలుడు కూడా సంబంధంలో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ విషయం తీవ్రత దృష్ట్యా, పోలీసులు పంజాబ్‌లో వివిధ పోలీస్ స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. తదుపరి దర్యాప్తు జరుగుతోంది.జమ్మూలోని సాంబా జిల్లాకు చెందిన ఆ బాలుడు గత ఏడాది కాలంగా పాకిస్తాన్‌లో ఉన్న ఐఎస్ఐ నిర్వాహకులకు భారతదేశానికి సంబంధించిన కీలకమైన సమాచారాన్ని పంపుతున్నాడని అధికారులు మంగళవారం తెలిపారు. సున్నితమైన సైనిక ప్రదేశాల ఫోటోలు, సమాచారాన్ని పంచుకున్నాడని, అతని మొబైల్ నుండి చాట్‌లు, కాల్ రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. విచారణ సమయంలో, పంజాబ్‌లోని అనేక ఇతర జిల్లాల్లోని చిన్న పిల్లలు ఐఎస్ఐతో సంబంధాలు కలిగి ఉన్నాయన్న విషయం వెల్లడైంది. పట్టుబడిన బాలుడి వయస్సు కేవలం 15 సంవత్సరాలు మాత్రమేనని, పాకిస్తాన్‌లోని ఐఎస్ఐతో అతను సంబంధాలు కలిగి ఉన్నాడని పఠాన్‌కోట్ ఎస్ఎస్‌పి తెలిపారు.పఠాన్‌కోట్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దల్జిందర్ సింగ్ ధిల్లాన్ మీడియాతో మాట్లాడుతూ, ఉగ్రవాద సంస్థలు, ఐఎస్ఐ, పాకిస్తాన్ సైనిక అధికారులకు దేశ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని అందిస్తున్నట్లు సమాచారం అందిన తర్వాత పోలీసులు ఆ బాలుడిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. తన తండ్రి హత్యకు గురయ్యాడనే అనుమానం వచ్చి, ఆ బాలుడు సోషల్ మీడియా ద్వారా పాకిస్తాన్ ఏజెన్సీల ఉచ్చులో పడ్డాడు. అది తనను మానసికంగా ప్రభావితం చేసిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అన్నారు. పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో అతని కమ్యూనికేషన్లను అనుసంధానించిన నిఘా, సాంకేతిక విశ్లేషణ తర్వాత, మైనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారువిచారణలో, ఆ బాలుడు ఒంటరిగా పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. ఇంకా చాలా మంది పిల్లలు ×ూ× కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. దీని కారణంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. వివిధ ప్రాంతాల్లోని ఇతర పిల్లలను గుర్తించడానికి హెచ్చరికలు జారీ చేశారు

# ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు మాఘ మేళా..

**అలహాబాద్, జనవరి 7:**ప్రయాగ్‌రాజ్‌లో 44 రోజుల పాటు సాగే మాఘ మేళా మొదలైంది. 2025లో నిర్వహించిన మహా కుంభమేళాకు మన దేశ నలుమూలల నుంచే కాకుండా.. ప్రపంచ దేశాల నుంచి.. కోట్లాది మంది భక్తులు వచ్చారు. ఇప్పుడు మాఘ మేళాకు కూడా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది.ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో గతేడాది మహా కుంభమేళా జరగ్గా.. ప్రస్తుతం మరో మాఘ మేళా మొదలైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా రికార్డుల్లోకి ఎక్కింది. అయితే ఈసారి అక్కడ మాఘ మేళా నిర్వహిస్తున్నారు. మొత్తం 44 రోజుల పాటు సాగే ఈ మాఘ మేళా.. పౌష పూర్ణిమ నుంచి మహాశివరాత్రి వరకు కొనసాగనుంది. ఈ ఉత్సవంలో కోట్లాది మంది భక్తులు సంగమ స్నానాలు ఆచరించనున్నారు. ఈ మాఘ మేళాకు విచ్చేసే భక్తుల కోసం యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రత, రవాణా ఏర్పాట్లు చేసింది. కుంభమేళా స్థాయి ఆధ్యాత్మిక అనుభూతిని ప్రశాంతమైన వాతావరణంలో పొందాలనుకునే వారికి ఈ మేళా సరైన వేదిక అని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.పవిత్ర త్రివేణి సంగమం వద్ద మాఘ మేళా 2026 అట్టహాసంగా ప్రారంభమైంది. జనవరి 3వ తేదీన పౌష పూర్ణిమ పుణ్యస్నానంతో మొదలైన



ఈ ఆధ్యాత్మిక ఉత్సవం ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి వరకు మొత్తం 44 రోజుల పాటు కొనసాగనుంది. కుంభమేళాతో పోలిస్తే తక్కువ రద్దీ.. ప్రశాంతమైన వాతావరణంలో భక్తి పారవశ్యాన్ని పొందేవారికి ఇది ఒక చక్కని అవకాశంగా మారనుంది.గతేడాది జరిగిన మహా కుంభమేళా రద్దీతో పోలిస్తే.. ఈ మాఘ మేళా భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. గంగ, యమున, అంతర్వాహిని తీన సరస్వతీ నదుల కలయిక అయిన త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానం ఆచరించడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. మాఘ మేళా ప్రారంభ తొలి రోజు అయిన పౌష పూర్ణిమ నాడే సుమారు 21.5 లక్షల మంది భక్తులు సంగమ తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించారు.ఈ మేళాలో ఆరు ప్రధాన స్నాన దినాలు ఉన్నాయి. మకర సంక్రాంతి (జనవరి 14), మౌని అమావాస్య (జనవరి 18), వసంత పంచమి (జనవరి 23), మాఘీ పూర్ణిమ (ఫిబ్రవరి 1), మహాశివరాత్రి (ఫిబ్రవరి 15).. ఈ రోజుల్లో త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. భక్తుల సౌకర్యార్థం 800 హెక్టార్ల మేళా ప్రాంతాన్ని 7 సెకార్లుగా విభజించారు. సుమారు 3800 ప్రత్యేక బస్సులు.. 42 పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.ఈ మాఘ మేళాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 17 పోలీస్ స్టేషన్లు, 42 అవుట్ పోస్టులు, 400 సీసీటీవీ ాెమెరాలతో నిరంతరం నిఘా ఉంచారు. మెడికల్ ఎమర్జెన్సీ కోసం మాఘ మేళా ప్రాంగణంలోనే రెండు 20 పడకల ఆస్పత్రులను నిర్మించారు.ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి అత్యంత భారీ స్థాయిలో జరిగేది కుంభమేళా. అయితే ఈ మాఘ మేళా మాత్రం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు. కుంభమేళాలో ఉండే సాధువుల సమాగమం, దానధర్మాలు, హారతులు, ఆధ్యాత్మిక చర్చలు అన్నీ మాఘ మేళాలోనూ ఉంటాయి. కానీ కుంభమేళాతో పోల్చితే.. మాఘ మేళాలో భక్తుల రద్దీ కొంత తక్కువగా ఉంటుంది.

# రిలయన్స్ షేర్లు కుదులు

**ముంబై జనవరి 7:**భారత్‌లోనే అత్యంత ధనవంతుడు, దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి బిగ్ షాక్ తగిలింది. చమురు కార్యకలాపాల్లో ప్రధానంగా ఉన్నటువంటి తన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు సెషన్‌లో కుదేలయ్యాయి. రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. ఇంట్రాడేలో ఏకంగా 5 శాతానికిపైగా పతనం కాగా.. చివరికి 4.50 శాతం వరకు కుప్పకూలింది. రిలయన్స్ వంటి హెవీ వెయిట్ స్టాక్.. ఒక్కరోజు ఈ స్థాయిలో పతనం అవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. ఇక్కడ స్టాక్ పతనం అయ్యేందుకు ప్రధాన కారణం రష్యా చమురు గురించి సంస్థకు లింక్ పెడుతూ వార్తలు రావడం. అవును.. ఇప్పటికే రష్యా ముడిచమురు కంపెనీలపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షలు విధించాయి. అలాంటి రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికీ ముడిచమురు దిగుమతి చేసుకుంటోందంటూ బ్లూమ్‌బెర్గ్ రిపోర్ట్ వెలువరించడం దీనికి కారణం.ఇక్కడ ముడిచమురును దిగుమతి చేసుకొని రిలయన్స్ ఇండస్ట్రీస్.. తన గుజరాత్ జామ్‌నగర్ రిఫైనరీలో శుద్ధి చేసి పెట్రోల్, డీజిల్ వంటి వాటిని ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తుంటుంది. ఇక్కడే ఆయా దేశాల ఆంక్షల్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉల్లంఘించినట్లు




వార్తలు వచ్చాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ దీనిని ఖండించి.. పచ్చి అబద్ధం అని ప్రకటించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. ఒకవైపు మార్కెట్లు భారీగా పడిపోతుండగా.. రిలయన్స్ షేరు కూడా కుదేలైంది. అంతకుముందు సెషన్‌లో రిలయన్స్ షేరు రూ. 1578.10 వద్ద ముగియగా.. జనవరి 6న ఒక దశలో ఇంట్రాడేలో 5 శాతానికిపైగా పతనమైంది. ఈ క్రమంలో రూ. 1496.30 వద్ద కనిష్ఠ స్థాయిని తాకింది. ఇక్కడ చూస్తే రిలయన్స్ మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో రూ. 1 లక్ష కోట్లకుపైగా తగ్గడం గమనార్హం. అంటే ఈ స్థాయిలో ఇన్వెస్టర్లు డబ్బులు పోగొట్టుకున్నారు. 2024, జూన్ 4 తర్వాత ఈ స్టాక్ ఇంతలా పతనం అవడం ఇదే తొలిసారి. చివరకు 4.50 శాతం వరకు నష్టంతో రూ. 1507.60 వద్ద స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ. 20.40 లక్షల కోట్లకు పడిపోయింది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 1611.80 కాగా.. కనిష్ఠ ధర రూ. 1114.85 గా ఉంది. నిఫ్టీ 50 స్టాక్స్‌లో అత్యధికంగా పడిపోయింది కూడా రిలయన్స్ ఇండస్ట్రీసే. ఇక బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ నష్టంలో 82 పాయింట్లు తగ్గేందుకు రిలయన్స్ ఇండస్ట్రీసే కారణం. అంతకుముందు ఏడాది వ్యవధిలో రిలయన్స్ షేరు 20 శాతానికిపైగా పెరిగినా.. ఇప్పుడు ఒక్కసారిగా భారీగా దిగిరావడం ఇన్వెస్టర్లలో ఆందోళనలకు కారణమైంది.

# కార్నర్ లో కార్...

- మొదటి పేజీ తరువాయి

విమర్శలు చేస్తూ వస్తున్న కవిత ఇప్పుడు మరింత స్పీడ్ పెంచారు. మొన్నటివరకు కేసీఆర్ దేవుడని, తన హీరో అని చెప్పిన కవిత..ఇప్పుడు ఆయనపైన ఇండైరెక్ట్ అటాక్ చేయడం చర్చకు దారితీస్తోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు నేరుగా తీసుకోకపోయినా ఆయనపై విమర్శలు చేశారు కవిత. శాసనమండలి సాక్షిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనపై సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయం అంటూ పరోక్షంగా కేసీఆర్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేశారు కవిత. తెలంగాణను ఏం ఉద్ధరించామని టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాలకు వెళ్లారంటూ మండలిలో ఉచ్చరించకూడని భాషతో తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నించారామె.కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ, పాలనపై కవిత చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముందు హరీశ్‌రావు, తర్వాత కేటీఆర్, ఇప్పుడు నేరుగా అధినేత కేసీఆర్‌ను అంటే మొత్తం కేసీఆర్ ఫ్యామిలీనే కవిత టార్గెట్ చేస్తున్నా..వాళ్లేవరు ఆమె కామెంట్స్‌పై ఎందుకు స్పందించడం లేదన్నది బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎదురవుతున్న ప్రశ్న.కవిత వ్యాఖ్యలు, ఆమె చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీకి ఎంతో కొంత నష్టాన్ని కలిగిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారట. ఆమె శాసన మండలిలో



కన్నీళ్లు పెట్టుకుని మరీ అధినేత కేసీఆర్ సహా పార్టీపై, తొమ్మిదిన్నరేళ్ల పాలనపై ఆరోపణలు చేయడంపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కవిత ఇంతలా సీరియస్ కామెంట్స్ చేసినా..అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు రియాక్ట్ కావడం లేదన్నది బీఆర్ఎస్ నేతలకు, క్యాడర్‌కు అంతుచిక్కడం లేదట.కవిత వ్యాఖ్యలపై పార్టీ నుంచి ఎంత మంది మాట్లాడినా ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు స్పందిస్తే ఎఫెక్ట్ వేరేగా ఉంటుందని చర్చించుకుంటున్నారట. లేకపోతే బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఇదే సమయంలో కవిత ఆరోపణలను అధినేత కేసీఆర్ కాకపోయినా కనీసం కేటీఆర్, హరీశ్‌రావు ఖండించకపోతే పార్టీకి నష్టం జరగడంతో పాటు ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు అస్త్రాలుగా మారతాయన్న ఆందోళన వ్యక్తమవుతోందటపార్టీ మహిళా నేతలతో కవితకు కౌంటర్ ఇప్పించినా అది ప్రజల్లోకి వెళ్లదని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఆమె ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి వాళ్లు సమాధానం చెప్తేనే బాగుంటుందన్న ఒపీనియన్స్ వస్తున్నాయట. అయితే కవిత అంతలా ఫ్యామిలీ మెంబర్స్‌ను టార్గెట్ చేస్తున్నా వాళ్లు మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యం వేరే ఉందన్న టాక్ వినిపిస్తోంది. కవిత ఎంత కాదనుకున్నా తమ కుటుంబ సభ్యురాలేనని, అధినేత కేసీఆర్ కూతురు కాబట్టి..ఆమె ఎన్ని ఆరోపణలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావు మౌనంగా ఉండాల్సి వస్తోందట.కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో లేకున్నా తమ ఫ్యామిలీ మెంబరే కావడంతో ఆమెపై తాము మాట్లాడటం సరికాదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కవిత ఇలా అధినేత కేసీఆర్‌పైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నా మౌనంగా ఉంటే బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో పాటు జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో కవిత దూకుడు ఎలా ఉంటుందో..బీఆర్ఎస్ రియాక్షన్ ఇంలా ఉంటుందో వేచి చూడాలి.

# ఎట్టకేలకు కవిత రాజీనామాకు ఆమోదం

## పంతం నెగ్గించుకున్న కవిత...

**హైదరాబాద్, జనవరి 7:**నిజామాబాద్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచింది. ఎట్టకేలకు ఆమె రాజీనామాను ఆమోదించారు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన కొద్ది కాసేపట్లోనే కవిత రాజీనామాకు ఆమోదం తెలుపుతున్నట్లు నోటిఫికేషన్ జారీ చేశారు లెజిస్లేటివ్ సెక్రటరీ. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. బీఆర్ ఎస్ పార్టీతో అంతర్గత విభేదాల కారణంగా గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీన ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. గడచిన సోమవారం శాసనమండలికి చివరిసారిగా హాజరై, తన రాజీనామాను ఆమోదించాలంటూ శాసన మండలి చైర్మన్ ను విజ్ఞప్తి చేశారు.చివరిసారి తాజాగా తెలంగాణ శాసన మండలిలో భావోద్వేగంగా ప్రసంగించిన కల్వకుంట్ల కవిత , తన రాజీనామా విషయంపై స్వయంగా చైర్మన్ కోరినా వినలేదు. తొందరపడకండి, ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవడం సరికాదు, మీరు బాధలో ఉన్నారు. మరోసారి రాజీనామాపై పునరాలోచించండి అంటూ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కవితకు చివరిసారి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆమె వినలేదు. తాను రాజకీయాల్లోకి అమెరికా నుంచి ఎందుకు వచ్చాను, తెలంగాణ ఉద్యమ సమయంలో జాగృతి ఏర్పాటు చేయడంతోపాటు, ఉద్యమానికి , బీఆర్ ఎస్ పార్టీకి జాగృతి చేసిన కృషి గురించి మండలిలో చివరి ప్రసంగంలో మాట్లాడారు కవిత. తన తండ్రి స్థాపించిన బీఆర్ ఎస్ పార్టీలో తాను మొదటి నుంచి ఎదుర్కొంటున్న అవమానాలను ప్రస్తావిస్తూనే, బీఆర్ ఎస్ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందంటూ మండలిలో సంచలన ఆరోపణలు చేశారు. కుటుంబ సభ్యుల నుంచి మద్దతు లేకుండా ఇన్నాళు తాను ఎదుర్కొన్న సవాళ్లను సభలో ప్రస్తావిస్తూ ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు కవిత. ఉబికి వస్తున్న కన్నీళ్లతో తన



ప్రసంగం ఆద్యంతం కొనసాగింది. ఇంతలా అవమానాలు ఎదుర్కొన్న తాను ఇక బీఆర్ఎస్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో కొనసాగలేనని, తన రాజీనామా వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరారు కవిత. కవిత మాటకు స్పందించిన చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారించే ప్రయత్నం చేసినా కవిత వినలేదు. ఇప్పటికే నాలుగు నెలలు రాజీనామా ఆమోదం కోసం ఎదురు చూశానని, అన్ని విషయాలు ఆలోచించిన తరువాతే ఈ నిర్ణయం తీసుకున్నానని, వెనక్కు తగ్గబోనని స్పష్టం చేశారు. కవిత రాజీనామా విషయంలో నిర్ణయం మార్చుకోవడం కష్టమని భావించిన శాసన మండలి చైర్మన్ తాజాగా ఆమె రాజీనామాకు తెలుపుతూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కవిత పంతం నెగ్గించుకున్నట్లైంది.

**మరో ఉపఎన్నిక...**

ఉత్కంఠకు తెరపడింది. జాగృతి అధ్యక్షురాలు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడింది. కవిత రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. గతేడాది సెప్టెంబర్ 2న బీఆర్ఎస్ పార్టీ కవితను సస్పెండ్ చేసింది. ఆ వెంటనే 3వ తేదీన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించారు.2022 జనవరిలో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో బీఆర్ఎస్ కు ఫుల్ మెజార్టీ ఉంది. నాడు కాంగ్రెస్ పోటీ చేయలేదు, బీజేపీ కూడా అభ్యర్థిని నిలపలేకపోయింది. ఆ పరిస్థితుల్లో కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2028 వరకు కవిత పదవీ కాలం ఉంది. అయితే రెండున్నర సంవత్సరాల పదవీ కాలం ఉండగానే ఆమె రిజైన్ చేసేశారు.ఇప్పుడు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. తెలంగాణలో మరో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. కవిత రాజీనామాకు ఆమోదం లభించడంతో కౌన్సిల్‌లో ఓ స్థానం ఖాళీ అయినట్టు ఎన్నికల కమిషన్‌కు చైర్మన్ కార్యాలయం నుంచి సమాచారం వెళ్లింది. దీంతో ఆ స్థానం భర్తీ కోసం కొన్ని రోజుల్లోనే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందికవిత రిజైన్ తో ఉపఎన్నిక అనివార్యమే అయినా స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాకే బైపోల్ జరిగే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఓటు వేయాలంటే మొదట స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎంపిక కావాల్సి ఉంటుంది.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది రాష్ట్ర ప్రభుత్వం. త్వరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ లెక్కన నిజామాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఓటర్లు లేరు. దీనివల్ల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఇప్పుడే నిర్వహించడం సాధ్యం కాదు. మున్సిపల్ కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది కాబట్టి.. పరిషత్ ఎన్నికలు ముగిశాకే పాలక మండళ్లు కొలువుదీరిన తర్వాతే ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కనీసం మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న కవిత.. తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయకపోవచ్చనే విశ్లేషణ వినిపిస్తోంది.డిసెంబర్ నెలలో పంచాయతీ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో మిగతా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు ముగియగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# షాపుల్లో లేని యూరియా.. యాప్‌లలో ఎలా వస్తుంది

## కమీషన్లకు కక్కుర్తి పడుతున్న ముగ్గురు మంత్రులు:కేటీఆర్

**ఖమ్మం:**ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ నూతన సర్పంచులు, ఉప సర్పంచుల అభినందన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ గ్రంథలయ సంస్థ చైర్మన్లు దిండిగల రాజేందర్, ఖమర్, మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండగట్టారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాలు లేవు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్లలో ఎలా వస్తుందని అన్నారు.కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. కౌలు



రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా? ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా? రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది? కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ ముగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకోండని డిప్యూటీ సీఎం భట్టి



విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయినా గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు? అని అన్నారు.ఆనాడు కేసీఆర్ ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో సీతారామ సాగర్ ప్రాజెక్టు పనులను 90% పూర్తి చేశారు.కానీ ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఆ ప్రాజెక్టును పక్కన పెట్టేశారు.30% కమిషన్ వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప.. జిల్లాకి పనికొచ్చే పనులు చేయడంలేదు.ఆనాడు కాంగ్రెస్ గ్యారెంటీ కార్డును అత్యంత భద్రంగా దాచి పెట్టుకోమన్నాడు భట్టి విక్రమార్క. హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు.. మరి రెండేళ్ళు అవుతుంది మీ హామీలు ఎక్కడ పోయాయి? ఇప్పుడు గ్యారెంటీ కార్డు ఎక్కడ పెట్టాలని అన్నారు.

# ఎన్నికలకు సిద్ధమవుతున్న పురపాలికలు

- మొదటి పేజీ తరువాయి

సూచనలు తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలలో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీల గుర్తులతో జరుగుతాయి. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ అవసరం. దీంతో ఆయా పార్టీల నియోజకవర్గ బాధ్యులను కలిసి తమ అంతరంగాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీలు మేడ్చల్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఎల్లంపేట, మూడు చింతలపల్లి లలో 24 వార్డులు చొప్పున, అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి.పోటీ చేయాలనుకునేవారు గ్రౌండ్ వరకు కూడా చేసుకుంటున్నారు. పార్టీల నాయకులు సైతం కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు హరి వర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ నిర్వహించారు. వీరు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల క్రితం ఎంపీ ఈటెల రాజేందర్ బిజెపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అందరూ ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో రిజర్వేషన్లపై ఉత్కంఠ ఏర్పడింది. ఈ మూడు కొత్త మున్సిపాలిటీలలో చైర్మన్ పదవి, వార్డ్ మెంబర్ పదవులు ఏ కేటాగిరికి రిజర్వేషన్ అవుతుందనే విషయంలో ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ సస్పెన్స్ ఉన్నప్పటికీ ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని భావిస్తున్నారు.

# 8 వేల కోట్లతో మంచినీటి సరఫరాకు ప్రణాళికలు

- మొదటి పేజీ తరువాయి



పూర్తిగా నిలిచిపోతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 'రింగ్ మెయిన్ల వ్యవస్థ కీలకం కానుంది. దీనివల్ల ఒక మార్గంలో అంతరాయం కలిగినా, ఇతర వనరుల నుండి నీటిని మళ్లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయవచ్చు. రాబోయే రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు కూడా అందుబాటులోకి రానుండటంతో, ఈ రింగ్ మెయిన్ ద్వారా 24 గంటల పాటు సమాన ఒత్తిడితో నీటిని అందించడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.హైదరాబాద్ సిటీకి అంతరాయం లేని తాగునీటి సరఫరాను అందించేందుకు ప్రతిపాదించిన అత్యంత కీలకమైన పైపులైన్ నెట్‌వర్క్‌ను 'రింగ్ మెయిన్ల అని పిలుస్తారు. ప్రధానంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ ప్రధాన పైపులైన్‌ను ఒక వలయంలా ఏర్పాటు చేస్తారు. ఇది నగరంలోని పలు ప్రాంతాలను కలుపుతూ ఉండే ప్రత్యేక పైపులైన్లతో అనుసంధానమై ఉంటుందిసాధారణంగా ఏదైనా ఒక ప్రధాన పైపులైన్ దెబ్బతింటే ఆ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. కానీ, ఈ రింగ్ మెయిన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే, ఒక దిశలో మరమ్మతులు జరుగుతున్నప్పటికీ, వలయంలా ఉన్న ఇతర పైపులైన్ల ద్వారా నీటిని మళ్లించి నిరంతరాయంగా సరఫరా చేయడానికి వీలుంటుందని అధికారులు ప్లాన్ చేశారు. దీనివల్ల నగరవ్యాప్తంగా నీటి పంపిణీలో ఎలాంటి అవాంతరం లేకుండా నియంత్రించవచ్చు.హైదరాబాద్ నగరానికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మిలియన్ గ్యాలన్ల పైగా నీటి అవసరం ఉంది. కృష్ణా (మూడు దశలు), గోదావరి (మొదటి దశ) ద్వారా మెజారిటీ అవసరాలు తీరుతున్నాయి.రిజర్వాయర్ల నిర్మాణం: రింగ్ మెయిన్ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి కీలక ప్రాంతాల్లో భారీ స్టోరేజ్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ఇది భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది.డిజిటల్ మానిటరింగ్: ఈ కొత్త పైపులైన్ వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నా లేదా నీటి ఒత్తిడి తగ్గినా వెంటనే గుర్తించేలా అత్యాధునిక స్కాడా టెక్నాలజీని ఉపయోగించే అవకాశం ఉంది. భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ఉపరితల జలాలను (నదీ జలాలు) శాస్త్రీయంగా వినియోగించుకోవడం ఈ ప్రాజెక్ట్ మరో ముఖ్య ఉద్దేశ్యం.

# త్వరలో మూడో ప్లేస్

**ముంబై, జనవరి 7:**భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. పెట్టుబడి బ్యాంకు భారతదేశ వాస్తవ +ఖా వృద్ధి 2027 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది 2026 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం కంటే కొంచెం తక్కువగా ఉంది.డిమాండ్‌కు మద్దతుగా నిర్ణయాత్మక విధాన మార్పు వృద్ధిని పెంచుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ పేర్కొన్నారు. 2025లో భారతదేశం ఆదాయపు పన్ను ఉపశమనాన్ని అందించింది. వస్తువులు, సేవల పన్ను )ని హేతుబద్ధీకరించింది. అన్ని రకాల పన్నులను సరళీకృతం చేసింది.. ద్రవ్యతను పెంచడంపై దృష్టి పెట్టింది. వినియోగానికి మద్దతుగా =దీ× రెపో రేటును మొత్తం 125 బేసిస్ పాయింట్లు తగ్గించింది.2021లో భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఈ సమయంలో భారతదేశం బ్రిటన్‌ను అధిగమించి ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అప్పటి నుండి భారతదేశం వేగం కొనసాగుతోంది. గత 25 సంవత్సరాలుగా భారతదేశం 6.4 శాతం, చైనా 8.0 శాతం కంటే వెనుకబడి ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ఈ ధోరణి మారిపోయింది.

# రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు

**కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే.." రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



హైదరాబాద్ జనవరి 7:రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు, కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమే.." అని రాష్ట్ర శాసనమండలి (కౌన్సిల్) చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు _. కవిత స్వయంగా వచ్చి తన ఎమ్మెల్యే పదవికి చేసిన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరడంతో ఆమోదించానని ఆయన బుధవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అన్నారు. అంతకు ముందు ఆమె స్వయంగా రాజీనామా లేఖ అందించకుండా వ్యక్తిగత కార్యదర్శి (పిఏ) ద్వారా పంపించినందున ఆమోదించలేదని ఆయన చెప్పారు. భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం అని భావించి కొంత సమయం ఇవ్వడం సర్వసాధారణంగా చేస్తుంటామని ఆయన తెలిపారు. చట్ట సభల్లో ఎక్కడైనా సభ్యుడు రాజీనామా చేసినప్పుడు ప్రసంగించేందుకు అనుమతించాలని కోరితే ఇవ్వడం సంప్రదాయంగా ఉందన్నారు. కవిత కోరిక మేరకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చానని ఆయన తెలిపారు. కవిత పార్టీ పెట్టబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం గురించి ప్రశ్నించగా, రాష్ట్రంలో రాజకీయ శూన్యత లేదు కాబట్టి కొత్త పార్టీలకు మనుగడ కష్టమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## వికారాబాద్ లో 25 నుంచి 31 వరకు అతి రుద్ర మహా యజ్ఞం సప్తాహ మహోత్సవం



**వికారాబాద్:**విశ్వకళ్యాణమే లక్ష్యంగా గత 15 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా పవిత్ర కార్తీక మాసంలో రుద్రాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పార్వతీ పరమేశ్వరుల ప్రీత్యర్థం, సనాతన వైదిక ధర్మ వైభవాన్ని చాటే విధంగా స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా తేది 25 ఆదివారం నుంచి 31 శనివారం వరకు అతి రుద్ర మహా యజ్ఞం సప్తాహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ మహోత్సవంలో మహాగణపతి హోమం, శతచండీ యాగం, రాజశ్యామల హోమం, మహాసుదర్శన చతుర్వేద స్వాహాకార సహిత అతిరుద్ర స్వాహాకార యాగం, సంకల్పిత హవనాలు నిర్వహించనున్నారు. అలాగే మహామంగళహారతి, వేదసేవఉఆశీర్వచనాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైదీక బ్రహ్మశ్రీ శ్రీరామశర్మ (స్మార్తాగ్నిఉతపది) పాల్గొననున్నారు.అలాగే ఈ విశేష ఆధ్యాత్మిక కార్యక్రమంలో పీఠాధిపతులు శ్రీమన్ని రంజన ప్రణవస్వరూప డా. చెన్నబసవ ప్రభు మహాస్వాములు (ఆలంపల్లి ఉ దుధని కంపిన మఠం), వైరాగ్యశిఖామణి అవధూత గిరి మహారాజ్, శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం, బర్దీపూర్ పీఠాధిపతులు, మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, ఆదిత్య పరాశ్రీ స్వామివారు (అంబాత్రయ క్షేత్రం), పూజ్యశ్రీ భిక్షమయ్య గురూజీ ఉ శ్రీ సత్యసాయి ధ్యాన మండలి, విజయవాడ పాల్గొని భక్తులను ఆశీర్వదించనున్నారు.ఈ కార్యక్రమ నిర్వహణలో భోగేష్ పంతులు, జ్యోషి సుభాష్ చంద్రకాంత్ శర్మ, మ్యాడం వెంకటేశం, కౌకుంట్ల రామకృష్ణ, తాండూరి రాజు, చిగుళ్ళపల్లి రమేష్ ముఖ్య నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అతి రుద్ర మహా యజ్ఞ ఫలితాన్ని పొందాలని నిర్వాహకులు కోరారు.

## ఫోన్ ట్యాపింగ్..ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రికి నోటీసులు



ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు కూడా నోటీసులు ఇచ్చారు. ఈ రోజు (బుధవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పీఎస్‌కి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

**9 గంటల పాటు నవీన్ రావు విచారణ**

రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. దాదాపు 9 గంటల పాటు విచారణ సాగింది. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 8 గంటల వరకు సాగింది. బీఆర్ఎస్ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి నవీన్ రావును అధికారులు విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో విచారణకు హాజరయ్యానని, అప్పట్లో మూడు గంటల పాటు అధికారులు తనను విచారించారని చెప్పారు. అప్పుడు చెప్పిన విషయాలనే ఇప్పుడు కూడా చెప్పానని అన్నారు. విచారణకు సహకరించానని, మళ్లీ పిలిచినా కూడా వస్తానని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీపై కేటీఆర్ విమర్శలు.. మంత్రి జూపల్లి కౌంటర్..



కేటీఆర్ అవకాశవాద లీడర్ అని, రాహుల్ గాంధీ నిజాయితీ గల లీడర్ అని తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను రాహుల్ గాంధీ మోసం చేశాడని, అతడిని నడిబజార్‌లో ఉరి తీయాలని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా మంత్రి జూపల్లి స్పందించారు రాహుల్ గాంధీ నిజాయితీ గల నాయకుడని, ప్రధాని అయ్యే అవకాశాన్ని సైతం వదులుకున్నారని జూపల్లి ప్రశంసించారు అలాంటి నాయకుడిని ఉరితీయాలనడం సరికాదని జూపల్లి అన్నారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, ఒక్కో దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామని కేసీఆర్ మాటిచ్చారని, ఆ మాట తప్పిన ఆయనకు కూడా ఈ సూత్రం వర్తిస్తుందని జూపల్లి పేర్కొన్నారు. ఉర్దూ యూనివర్సిటీకి ఇచ్చిన భూమిని ఇప్పటివరకు ఎందుకు వినియోగించలేదో వివరణ కోరుతూ కలెక్టర్ నోటీస్ ఇవ్వడంలో తప్పులేదని, ఆ కలెక్టర్‌ను అభినందించాలని జూపల్లి అన్నారు.

## జనవరి 9వ తేది నుండి ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టిక్కెట్లు జారీ

**నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు**

**తిరుమలలో ఆఫ్ లైన్ శ్రీవాణి దర్శన టిక్కెట్ల జారీ నిలిపివేత**

**తిరుమల:**భక్తుల సౌకర్యార్థం, పరిపాలనా అవసరాల దృష్ట్యా టీటీడీ శ్రీవాణి దర్శన టిక్కెట్ల జారీ విధానంలో మార్పులు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్లైన్ కౌంటర్ల ద్వారా జారీ చేస్తున్న టిక్కెట్లను జనవరి 9 నుండి రోజువారి ఆన్లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో కేటాయించనున్నారు.ఈ మేరకు తిరుమలలో రోజువారి విధానంలో ఆఫ్లైన్ ద్వారా జారీ చేస్తున్న 800 శ్రీవాణి దర్శన టిక్కెట్లను ఆన్లైన్ ద్వారా రోజూవారి కరెంట్ బుకింగ్లోకి మార్చనున్నారు. ఈ టిక్కెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్లైన్లో విడుదల చేసి, మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.ఒక్క కుటుంబానికి 1౦3 సభ్యులు (మొత్తం నలుగురు) మాత్రమే టికెట్ బుకింగ్కు అనుమతి ఉంటుంది. టిక్కెట్ల బుకింగ్ లో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధృవీకరణ, మొబైల్ నంబర్ వంటి వివరాలు తప్పనిసరి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్డ్ విధానంలో భక్తులు టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. తద్వారా ఆఫ్ లైన్ లో శ్రీవాణి దర్శన టిక్కెట్ల కోసం భక్తులు క్యూలైన్ లో నిరీక్షించే సమస్య తొలగిపోతుంది. ఈ నూతన విధానాన్ని నెల రోజులపాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.అదేవిధంగా రోజుకు 500 శ్రీవాణి దర్శన టిక్కెట్లను ఆన్ లైన్ అడ్వాన్స్ బుకింగ్ విధానంలో ఇప్పటికే విడుదల చేయడం జరిగింది. మూడు నెలల అనంతరం ఈ విధానంపై సమీక్షించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.తిరుపతి విమానాశ్రయంలో ప్రతిరోజూ భక్తులకు ఆఫ్ లైన్ విధానంలో జారీ చేస్తున్న 200 టిక్కెట్ల జారీ విధానం కూడా యథవిధిగా కొనసాగనుంది.అన్ని వర్గాల భక్తులను దృష్టిలో ఉంచుకుని టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని గమనించి భక్తులు తమ దర్శన ప్రణాళికలను రూపొందిచుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

# ఆత్మగౌరవ నినాదం - తెలంగాణ సెంటిమెంట్



**హైదరాబాద్, జనవరి 7:**తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా కన్నీరు పెట్టుకోవడం, ఆ వెంటనే తెలంగాణ జాగృతి ని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటించడం వెనుక అత్యంత పకడ్బందీగా రూపొందించిన ఎమోషనల్ పొలిటికల్ స్ట్రాటజీ కనిపిస్తోంది. కుటుంబ బంధాలను తెంచుకున్నట్లు ప్రకటించడం ద్వారా ఆమె ఒక రకమైన సానుభూతి వాతావరణాన్ని సృష్టించుకునే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో సానుభూతి అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. కవిత తన ప్రసంగంలో పుట్టింటి నుంచి అవమానభారంతో బయటకు వచ్చాను అని చెప్పడం ద్వారా తనను ఒక బాధిత ఆడబిడ్డ గా చిత్రించుకున్నారు. తెలంగాణ సమాజంలో ఆడబిడ్డలకు, సెంటిమెంట్‌కు ఇచ్చే ప్రాధాన్యతను ఆమె సరిగ్గా వాడుకున్నారు. ముఖ్యంగా కుటుంబ పెద్దల నుంచి లేదా సొంత పార్టీ నుంచి తనకు అన్యాయం జరిగిందని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన పట్ల ఒక రకమైన సానుభూతి కలిగేలా చేయడంలో ఆమె ప్రాథమికంగా విజయం సాధించారుకవిత తన పోరాటాన్ని నేరుగా బీఆర్ఎస్ నాయకత్వంపైకి మళ్లించడం ద్వారా ఆ పార్టీలో ఉన్న అసంతృప్త నేతలకు, క్యాడర్‌కు ఒక దిక్సూచిగా మారాలని చూస్తున్నారు. ప్రశ్నిస్తే కక్షగడతారా అనే ప్రశ్న వేయడం ద్వారా బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. ఇది కేవలం పార్టీపై కోపం మాత్రమే కాదు, బీఆర్ఎస్ ఓటు బ్యాంకును లేదా అసంతృప్త నాయకత్వాన్ని తన వైపు తిప్పుకోవడానికి వేసిన ఒక వ్యూహాత్మక అడుగు. కవిత కొత్త పార్టీ పెడుతున్నట్లు ప్రకటించడం హఠాత్తుగా జరిగింది కాదు. చాలా కాలంగా ఆమె జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు దానికి రాజకీయ రంగు అద్దడం ద్వారా, తనకంటూ ఒక సొంత సైన్యం ఇప్పటికే సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చారు. కేవలం సెంటిమెంట్‌తోనే కాకుండా,గత పదేళ్లుగా తాను చేసిన సామాజిక సేవను ఓట్లుగా మలుచుకోవడానికి ఆమె ఈ వేదికను వాడుకున్నారు.తెలంగాణ రాజకీయాల్లో ఆత్మగౌరవం అనేది ఎప్పుడూ కీలకం. కవిత గారు తన నిర్ణయాన్ని తన వ్యక్తిగత గౌరవానికి మించి, తెలంగాణ ఆడబిడ్డల పౌరుషానికి, ఆత్మగౌరవానికి ముడిపెట్టారు. ఇది ఆమెకు కేవలం సానుభూతిని మాత్రమే కాదు, ఒక పోరాట పటిమ గల నాయకురాలిగా గుర్తింపును తెస్తుంది. బంధనాలు తెంచుకున్నాను అని చెప్పడం ద్వారా తాను ఎవరికీ లొంగని, స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగబోతున్నానని ఆమె ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీఆర్ఎస్ , బీజేపీలు ప్రతిపక్షంలో ఉన్నాయి. అయితే, ఒక బలమైన ప్రాంతీయ గొంతుక లేదా ప్రత్యామ్నాయ శక్తి కోసం చూస్తున్న వర్గాలను ఆకర్షించడానికి కవిత ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా సామాజిక తెలంగాణ కోరుకునే వారు, సెక్యులర్ భావజాలం ఉన్నవారు, యువతను లక్ష్యంగా చేసుకుని ఆమె తన అజెండాను ప్రకటించారు.కవిత ప్రాథమికంగా సానుభూతి వాతావరణాన్ని సృష్టించుకోవడంలో విజయవంతమయ్యారు. కానీ, రాజకీయాల్లో కేవలం కన్నీళ్లు లేదా ఎమోషనల్ స్పీచ్‌లు మాత్రమే గెలుపును అందించవు. ఆ సానుభూతిని క్షేత్రస్థాయిలో ఓట్లుగా మార్చగలిగే బలమైన కేడర్ , స్పష్టమైన రాజకీయ కార్యాచరణ ఆమెకు అవసరం. మె ఒంటరి పోరాటం ఎంతవరకు సఫలమవుతుందనేది రాబోయే రోజుల్లో ఆమె ప్రకటించే పార్టీ విధివిధానాలపై ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు.

# చైనా మాంజా.. యమ డేంజర్..

**- నిషేధం విధించినా కొన్ని ప్రాంతాల్లో విక్రయిస్తున్న వైనం**



**హైదరాబాద్:** సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పతంగులను ఎగురవేస్తుంటారు. పతంగులను ఎగురవేస్తున్న వారు కొందరు చైనా మాంజా వినియోగిస్తున్నారు. చైనా మాంజా వల్ల మనుషులకే కాకుండా జంతువులు, పక్షులకు ముప్పు ఏర్పడుతుండడంతో నిషేధించారు. అయినా అల్వాల్, లోతుకుంట, ఓల్డ్ అల్వాల్, టెంపుల్ అల్వాల్, మచ్చబొల్లారం, భూదేవినగర్ తదితర ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**పతంగుల పోటీలు...**

యువత పోటీ పడి ఒకరి పతంగిని మరొకరు కట్ చేసి ఆనందపడుతుంటారు. చైనా మాంజా వినియోగించి ఎదుటువారి గాలిపటాన్ని కట్ చేసేందుకు బెట్టింగ్‌కు కూడా పాల్పడుతుంటారు. ఈ క్రమంలో పతంగుల నుంచి తెగిపడిన చైనా మాంజాలు విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్ల కొమ్మలకు చిక్కుకుంటున్నాయి. గాలికి అవి పాదచారులు, వాహనదారులపై పడడంతో గాయపడుతున్నారు. చైనా మాంజా విక్రయిస్తే చర్యలు చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పతంగులకు నైలాన్ లేదా సాధారణ దారాలను మాత్రమే వినియోగించాలి.

# చంపేస్తున్న చలి..



**వరంగల్, జనవరి 7:**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అయితే తెలంగాణ రాష్ట్రంలో చలి పులి చంపేస్తోంది. రాగల రోజుల్లో చలి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ.. రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్రతకి వృద్ధులు, చిన్న పిల్లలు అధికంగా అనా రోగ్యానికి గురవుతున్నారు. చలి అంటే అందరికీ సహజసిద్ధమైన ఋతువు. కానీ చల్లని గాలులు, ఉదయాన్నే కమ్మేసే పొగమంచు, రాత్రివేళల్లో చలికాలం తెచ్చే వణుకు ఇవన్నీ శరీరానికి కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా చలి కాలం ఆనందదాయకమైనదే అయినా, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోకపోతే పులిలా దాడి చేసే ప్రమాదం ఉంటుంది.అందుకే ఈ సీజన్ను సరిగ్గా ఎదుర్కోవడం చాలా అవసరం. అయితే ములు గు జిల్లాలో ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాం తం కాబట్టి చుట్టూ పక్కన పల్లెల్లో చలి తీ వ్రత రోజురోజుకు చలి విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతిరోజు తెల్లవారుజామున పొగ మంచు విపరీతంగా పడుతోంది. ఈ పొగమంచుకి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ చలి తీవ్రతకి మండలంలోని గ్రామాల ప్రజలు బయటికి రావడం లేదు. వృద్ధులు, చిన్నారులు మాత్రం అనారోగ్యబారిన పడుతున్నారు.చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలపైనే అధిక ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉంది. వృద్ధులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు చలి ప్రభావానికి ఎక్కువగా గురవుతారు. శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోవడం వల్ల వారిలో శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, దమ్ము వంటి వ్యాధులు తలెత్తే అవకాశం ఉంది. చలికాలంలో బిగుతైన, వేడిగా ఉంచే దుస్తులు ధరించడం తప్పనిసరి. చిన్నపిల్లల్లో గురక, ఎగశ్వాస, జలుబు, డబ్బు వంటి లక్షణాలు అధికంగా ఉంటుంది. శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడతారు.ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారు చల్లని వాతావరణంలో ఎక్కువసేపు ఉండకూడదు. బయటకు వెళ్లేటప్పుడు ముక్కు, చెవులు, మెడ కప్పుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తరచూ త్రాగడం, పొడి వాతావరణంలో తేమను నిలుపుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.చలికాలంలో శరీరం వేడిని కోల్పోతుంది. అందుకే వేడి పానీయాలు, సూపులు, గోరువెచ్చని నీరు తాగడం శరీర రక్షణకు ఉపకరిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

## హైదరాబాద్ మౌలానా ఉర్దూ యూనివర్శిటీ భూముల స్వాధీనానికి జిల్లా కలెక్టర్ నోటీసులు

**మండి పడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**హైదరాబాద్:**హైదరాబాద్ మౌలానా ఉర్దూ యూనివర్శిటీ లోని 50 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని నోటీసుల్లో కలెక్టర్ పేర్కొనడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. వేల కోట్ల రూపాయల విలువైన వర్శిటీ భూములను అమ్మి దోచుకోవాలనుకుంటున్నారా? కనీస సౌకర్యాలు కల్పించడం చేతగాని ప్రభుత్వం విద్యా సంస్థల భూములను అమ్ముకోవాలనుకుంటోందని ఆరోపించారు.విద్యా సంస్థల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ సర్కార్ కు అల్టిమేటం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమైన అనేక ప్రభుత్వ భూములున్నాయి. పాతబస్తీలో సల్కం చెరువును కబ్జా చేసి విద్యా వ్యాపారం చేస్తున్న ఒవైసీపై చర్యలేవి? వాటిని స్వాధీనం చేసుకుని ప్రజోపయోగ అవసరాలకు ఎందుకు ఉపయోగించడం లేదు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే వర్శిటీల, విద్యా సంస్థల భూములపై కన్నేయడం సిగ్గు చేటని అన్నారు. తక్షణమే సర్కార్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

## దాసారం బస్తీలో ఎమ్మెల్యే తలసాని పర్యటన

**హైదరాబాద్**: మీరు ఎవరికి భయపడొద్దు. మీకు అండగా ఉంటామని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ దాసారం బస్తీ గుడిసె వాసులకు భరోసా ఇచ్చారు. ఇటీవల సనత్ నగర్ లోని దాసారం బస్తీలో గుడిసె వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ గుడిసెలు ఖాళీ చేయాలని కొంతమంది వ్యక్తులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి దాసారం బస్తీలో పర్యటించి స్థానిక గుడిసె వాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాలలో చెత్తను సేకరిస్తూ పారిశుధ్య నిర్వహణ తో పాటు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. గుడిసెలు ఏర్పాటు చేసిన స్థలం మాది అని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు వారు, మాదే ఈ స్థలం అంటూ కొందరు ప్రయివేట్ వ్యక్తులు గుడిసె వాసులను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2014 లో తాను ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత గుడిసె వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వచ్చామని గుర్తు చేశారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో విద్యుత్, త్రాగునీటి సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటూ స్థానికంగా ఓటు హక్కును కూడా కలిగి ఉన్నారని వివరించారు. మీరు అంతా ఐక్యంగా ఉండాలని, ఎవరికి భయపడాల్సిన పని లేదని స్పష్టం చేశారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతి..

**బుధవారం వేకువ జామున ఘటన..**

**కొవ్వూరు:**తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో బుధవారం వేకువ జామున రోడ్డు ప్రమాదం జరిగింది. కొవ్వూరు ఫ్లైఓవర్ పై వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అకస్మాత్తుగా పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటనతో ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొనగా, కొంత సేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది.మంటలు చెలరేగిన వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ తక్షణమే బస్సును రోడ్డుపక్కకు నిలిపివేయడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న ఆరుగురు ప్రయాణికులు, నలుగురు సిబ్బంది వేగంగా కిందికి దిగిపోయారు.ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. ఈ ఘటనలో దాదాపు రూ.80 లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

## సీఎన్కే ల్యాబ్ పై అధికారుల దాడి...

**పరారీలో ల్యాబ్ ఓనర్**

**హైదరాబాద్:**మంగళవారం అర్ధరాత్రి కాచిగూడ లోని సీఎన్కే ల్యాబ్స్ పై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు, ఈస్ట్ జోన్ పోలీసులు, క్లూస్ టీమ్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ల్యాబ్ లోని సిబ్బందిని ప్రశ్నించి మేకలు, గొర్రెల రక్తం నిల్వలు, కొనుగోలు పత్రాలు, ఇతర రికార్డు లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ దందాలో కీలక సూత్రధారిగా భావిస్తున్న సీఎస్కే ల్యాబ్ ఓనర్ నికేశ్ రెండు రోజుల ముందే పారిపోయాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నికేశ్ దొరికితే ఈ దందాలో ఇంకా ఎవరెవరున్నారనేది బయటపడే అవకాశం ఉంది.

# చేనేత కార్మికులకు పూర్వ వైభోగం తీసుకొద్దాం..

## చేనేత కార్మికులకు త్వరలోనే రుణమాఫీ ....

## చేనేత కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో పరికరాల పంపిణీ కార్యక్రమం హాజరైన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, జనవరి 7 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్ నందు ఎన్ హెచ్ డి పి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులు గద్వాల నియోజకవర్గంలో గద్వాల ౘ గట్టు చేనేత కార్మికుల క్లస్టర్ అభివృద్ధి పథకం ద్వారా పరికరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే కి చేనేత కార్మికులకు శాఖ అధికారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.గద్వాల నియోజకవర్గం గద్వాల ౘ గట్టు చేనేత కార్మికుల క్లస్టర్ పరిధిలోని గద్వాల 237 మందికి, గట్టు కార్మికుల క్లస్టర్ 131 మందికి పరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతం చేనేత కార్మికులకు చేనేత చీరలకు ప్రసిద్ధి చెందినది ప్రస్తుతం చేనేత రంగంలో టెక్నాలజీ అనుకూలంగా ఎన్నో రకాల పరికరాలు రావడం జరిగింది. వాటిక అనుకూలంగా చేనేత కార్మికులు చేనేత చీరలను తయారు చేయాలి అని తెలిపారు.గద్వాల పేరు ప్రతిష్టను గద్వాల పేరు మీద చీరలను తయారుచేసి గద్వాల బ్రాండ్ ను వాడుకుని అభివృద్ధి చెందడం జరుగుతుంది. నిజమైన గద్వాల చేనేత కార్మికులు నష్టం జరుగుతుంది. కాబట్టి చేనేత కార్మికులు పాత పద్ధతిని కాకుండా కొత్త



పద్ధతిలో కూడా కొత్త టెక్నాలజీ పరికరాలను వాటిని వాడి చేనేత చీరలను తయారు చేయాలని సూచించారు. చేనేత కార్మికుల యొక్క కష్టాలను తెలిసిన వాడిగా చిన్నప్పటినుండి చేనేత కార్మికుల ప్రాంతంలో పెరిగిన వాడిని గతంలో ప్రభుత్వం దృష్టికి చేనేత కార్మికులకు నివాసము వారు చేసే చేనేత వస్త్ర తయారీని ఒకే దగ్గర ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కోరడం జరిగింది. దానిని ఇంకా పూర్తి కాలేదు భవిష్యత్తులో చేనేత కార్మికుల కోసం మరొకసారి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి చేనేత కార్మికుల వ్యవస్థ మరియు వారి స్వగృహము ను ఒకే దగ్గర ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.ప్రతి ఒక చేనేతకు కార్మికులు జియో టాగ్ను కలిగి ఉండాలి జియో టాగ్ ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ నుండి వచ్చే ప్రతి ఒక్క సంక్షమ పథకం అభివృద్ధి పథకాలు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్తులో గద్వాల చేనేత కార్మికుల వ్యవస్థను కాపాడే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి చేనేత కార్మికుల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

**చేనేత దుస్తులను ధరిద్దాం**

చేనేత కార్మికులను కాపాడుద్దాం ..ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్స్ మురళి నాగిరెడ్డి నరహరి శ్రీనివాసులు, శ్రీమన్నారాయణ, శ్రీను ముదిరాజ్, నాయకులు షుకుర్ , అన్వర్, మోబిన్, వంట భాస్కర్ రామాంజనేయులు, లక్ష్మన్న, రిజ్వాన్, సంగాల నర్సింహులు గువ్వల గోపాల్, శ్రీనివాస్ , యువ నాయకులు సంతోష్, చిట్టెం పురుషోత్తం రెడ్డి, యాదవ్ ఎని ప్రవీణ్, మోహన్ యాదవ్, జిల్లా అధికారి, చేనేత కార్మికుల జిల్లా అధ్యక్షులు రామలింగేశ్వర , చేనేత కార్మికుల అధ్యక్షులు అక్కల శ్రీనివాసులు, నాయకులు మంత్రి సురేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, జనవరి 7 (స్కై న్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ జన్మదిన సందర్భంగా మరియు గద్వాల జిల్లా కలెక్టర్ గా రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగాగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ గారికి గద్వాల ఎమ్మెల్యే ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.భవిష్యత్తులో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను కోరుకుంటున్నాను తెలిపారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లక్ష్మనారాయణ గారు, జిల్లా గ్రంథలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు కురుమన్న, రామకృష్ణ నాయుడు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దు.. అవకాశం వదలొద్దు

**పేట జిల్లా ప్రతిష్ట పెంచాలి**

**-పేటలో సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభించిన డీఎస్పీ.**



**నారాయణపేట జనవరి 7:( స్కైన్యూస్)** జిల్లా విద్యార్థులు చదువు, క్రీడలను సమాన ప్రాధాన్యత ఇచ్చి ఆకాశమే హద్దుగా ముందుకు సాగి జిల్లా ప్రతిష్ట పెంచాలని నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య సూచించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథరిటీఆధ్వర్యంలో నిర్వహించనున్న సీఎం కప్ 2025- 26 క్రీడా పోటీల సంద ర్భంగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో బుధవారం ఉదయం సీఎం కప్ టార్చ్ ర్యాలీని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివ రెడ్డి తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భం గా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, చదువుకు కూడాచాలా ప్రాధా న్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారుల ప్రతిభను వెలికితీ సి వారిని అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా చేయడ మే లక్ష్యంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ అవ కాశాన్ని క్రీడాకారులు సద్విని యోగం చేసుకుని క్రీడల్లో రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. కాగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ మినీ స్టేడియం నుంచి సత్య నారాయణ చౌరస్తా,పాత బస్టాండ్ సెంటర్ చౌక్ మీదుగా దామ రగిద్ద కు చేరుకుంది.ఈ కార్య క్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, మార్కెట్ కమిటి డైరెక్టర్ శరణప్ప, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పీడీ.గొడుగు నర్సిములు, వ్యాయామ ఉపాధ్యాయులు సాయి, అనంత సేన, బాల్ రాజ్,ఆర్ రమణ, రత్నయ్య, అక్తర్ పాషా, మైనార్టీ గురు కుల కళాశాల, బీసీ బాలికల జూనియర్ కళాశాల, స్థానిక క్రికెట్ అకాడమీ క్రికెటర్లు, సీని యర్ క్రీడాకారులు, క్రీడాభిమా నులు పాల్గొన్నారు.

## శిక్షణ ఫౌండేషన్ రెండవ దశ ఎఫ్ ఎల్ ఎన్ మరియు స్టెమ్ పుస్తకాల పంపిణీ



**జోగులాంబ గద్వాల, జనవరి 7 (స్కై న్యూస్,):** శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గట్టు మండలంలోని 23 ప్రభుత్వ పాఠశాలలకు ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఫౌండేషన్ ఎల్ టీ ఐ మైండ్ ట్రీ వారి సహకారంతో రెండవ దశ ఎఫ్ ఎల్ ఎన్ పుస్తకాలను జడ్పీహెచ్ఎస్ చాగదోన గెజిటెడ్ హెచ్ఎం రామ్మూర్తి చేతుల మీదుగా అందించడం జరిగింది. శిక్షణ ఫౌండేషన్ వారు విద్యార్థులలో బేసిక్ లెవెల్స్ ను పెంచాలని ఉద్దేశంతో ఎఫ్ ఎల్ ఎన్ పుస్తకాలను మరియు స్టెమ్ పుస్తకాలను ఇవ్వడం జరిగింది వాటిని విద్యార్థులు తప్పకుండా ఉపయోగించుకోవాలని గెజిటెడ్ హెచ్ఎం సూచించడం జరిగింది . శిక్షణ ఫౌండేషన్ వారు చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఈ సందర్భంగా గెజిటెడ్ హెచ్ఎం రామ్మూర్తి సార్ చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామ్మూర్తి మరియు పాఠశాల ఉపాధ్యాయులు మరియు శిక్షణ ఫౌండేషన్ మెంటర్స్ హనుమంతు గంగయ్య ప్రేమరాజు పాల్గొన్నారు

## రోడ్డు భద్రతపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలి

**జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు**

**నారాయణపేట జనవరి 7: (స్కైన్యూస్)** ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా నియమాలు పాటించెలా ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ బోయ శ్రీనివాసులు అన్నారు. తెలం గాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు వారి చాంబర్స్ లో బుధవారం రోడ్ సురక్ష అభియాన్-2026 గురించి కరపత్రం విడుదల చేశారు. ఈ రోడ్డు భద్రతా వారోత్స వాలు ఈ నెల జనవరి 5 నుంచి 9 వరకు నిర్వహిస్తు న్న కార్యక్రమములో భాగంగా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివా సులు,సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి. సాయి మనోజ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి. అవినాష్, ట్రాఫిక్ ఎస్.ఐ. కృష్ణ చైతన్య హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లా డుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ప్రజలకు వారోత్సవాలలో అవగాహన కల్పించాలని అన్నారు. రహదారి భద్రత కార్యాచరణ పాటిస్తూ, రోడ్డు భద్రత ప్రాణాలను కాపాడు తుంది, అప్రమత్తతో మెలిగి ప్రమాదాలను



నివారించాలని అన్నారు. అధిక వేగం తో వాహనాలను నడిపి ప్రాణాల ను కోల్పోవద్దని, ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనాలు నడిపే టప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాలని , సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనా లను నడపరాదని సూచించా రు. వాహనా లు నడిపే ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లిన తమ కోసం తమ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తూ ఉంటారన్న విషయాన్ని గమనించాలని వీటిని గమనించి రోడ్డు పై వాహ నాలను జాగ్రత్తగా నడిపి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

## కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులను అభినందించిన జిల్లా జడ్జి బోయ



**నారాయణపేట జనవరి 7:( స్కైన్యూస్)** కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులు గా నియమించబడిన ముగ్గురు న్యాయవాదులను బుధవారం నారాయణపేట జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు అభినందించారు.తమ నియా మక పత్రాలను కేంద్రప్రభుత్వ న్యాయవాది అదనపు న్యాయవాదులు బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులుకు కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘు వీర్ యాదవ్, అదనపు న్యాయవాదులు నందు నామాజీ,కురుమన్న గౌడ్ కలిసి కేంద్ర ప్రభుత్వం తరఫున తమకు వచ్చిన నియామక పత్రాలు జీవోను కాపీలను అందజేసినారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ అభినందిస్తూ మీ విద్యుక్త ధర్మాన్ని ,నియ మాలకు అనుగుణంగా పని చేయాల్సిందిగాసూచించా రు.ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు చెన్నారెడ్డి, మల్లి కార్జున్,ఎస్ నారాయణ, మాజీ ఏజీపీ సతీష్ గౌడ్, భరత్ కుమార్ ,రాజురెడ్డి, రాములు,రామ్మోహన్, నర్సింలు,వినోద్ ,దినేష్, లక్ష్మపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి...

**మండల విద్యాధికారి నిజముద్దీన్**

**నారాయణపేట జనవరి 7: (స్కైన్యూస్)** బాలికలు విద్యా,క్రీడలతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలనీ కృష్ణ మండలం విద్యాధికారి నిజామొద్దిన్ అన్నారు.బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుమాల్ లో బేటి బచా వో బేటి పడావో కార్యక్రమం లో భాగంగా జిల్లా మహిళా శిశు సాధికారత సంస్థ ఆధ్వ ర్యంలో విద్యార్థినిలకు అవగాహన కల్పించడంతో పాటు పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మాట్లా డుతూ బాలికల చదువు చాలా అత్యవసరమని అన్నా రు వారు చదువుకోవడం వల్ల కుటుంబాలు బాగుపడతా యని వారు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. విద్యార్థినిలు క్రమశిక్షణతో చదువుకొని ఎదగాలని కోరారు. గ్రామ సర్పంచ్ బాలరాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు గ్రామాల్లో జరగకుండా విద్యాభివృద్ధికి తన వంతు సహకారము అందజేస్తాను అని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన గ్రామ పాలకమం డలి సర్పంచ్ బాలరాజు ,ఉపసర్పంచ్ రంగమ్మ వార్డు మెంబర్ చెన్నయ్య గౌడ్ ల ను పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ



కార్యక్రమంలో గుడె బల్లూరు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు గణేష్ గారు పి ఆర్ టియు టి ఎస్ నారాయ ణపేట జిల్లా అధ్యక్షులు వై. జనార్దన్ రెడ్డి , కృష్ణా మండల అధ్యక్షులు దండు శేఖర్ ఏపీసీ చైర్మన్ లింగమ్మ, బేటి బచావో బేటి పడావో కోఆర్డినేటర్ నరసింహులు గారు జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహులు, ఉపాధ్యాయ బృందం కురుమయ్య,శ్రీనివాసు, మాధవి, రమేషు, తిమ్మ ప్ప,హేమా మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి లో చేరిన 9 వ వార్డు యువత...



**నారాయణపేట జనవరి 7: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని 9 వ వార్డులో యువకులు పెద్ద ఎత్తున బిజెపి లో చేరారు.ప్రధాని నరేంద్రమోడీ,ఎంపి డి కే అరుణ చేసిన్న అభివృద్ధి కి ఆకర్షితులై బుధవారం జిల్లా బిజెపి అద్యక్షుడు సత్య యాదవ్,పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్,దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సమక్షంలో బిజెపిలో చేరారు.పార్టీలో చేరిన వారిలో భారత్,మహేందర్,రాజు, వెంకటేష్,సింగారం అంజి, తిరుమలేష్,ఉల్ల మహేష్, మన్నే నవీన్, కర్రోల వెంకటేష్,భీంశప్ప తదితర యువకులు అన్నారు.వీటికి సత్య యాదవ్,వినోద్,కృష్ణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీరు ఏ ఆశయంతో బిజెపిలో చేరారో ఆ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

## వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి 50,000 వితరణ

**హైకోర్టు అడ్వకేట్ మందాడి సరోజ్ రెడ్డి**

**దేవరకద్ర, భూత్పూర్ జనవరి 7 (స్కై న్యూస్);** భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కొరకు 50,000 రూపాయలు విరాళం అందించిన హైకోర్టు, అడ్వకేట్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి సరోజ్ రెడ్డి అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆలయ కార్య నిర్వాహకులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అడ్వకేట్ వెంట బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ కు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అందజేసిన సర్పంచ్ గోపాల్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూ జనవరి 7:-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో నూతన సంవత్సరంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులతో ప్రచారం జరగాలని అన్ని వర్గాలు సుభిక్షంగా సురక్షతంగా ఉండాలని తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీవారి ఆలయాన్ని దర్శించి స్వామివారి ప్రత్యేక లడ్డును స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ గోటిక గోపాల్ రెడ్డి అందజేశారు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలను కలుసుకున్న అయ్యవారిపల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ సీమల మల్లేష్, వార్డు సభ్యురాలు మంజుల రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని స్వయంగా అందజేశారు. నియోజకవర్గంలో పాటు రాష్ట్ర ప్రభుత్వం మంచి అభివృద్ధి సాధించి ప్రజలకు మేలు చేసే విధంగా శ్రీ వెంకటేశ్వరుని కరుణ కటాక్షలు ఉండాలని ఎమ్మెల్యేతో గోపాల్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# వందేళ్లైనా ప్రజాదరణ తగ్గని ఏకైక పార్టీ సిపిఐ

## పేద విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తాం...

**వాసవి క్లబ్ అధ్యక్షులు సంబు శ్రీనివాసులు**



**నాగర్ కర్నూల్ బిజినేపల్లి జనవరి 7 (స్కై న్యూస్)** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరంలో పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని విద్యార్థులు విద్యను కష్టంగా కాకుండా ఇష్టంతో అభ్యసించాలని వాసవి క్లబ్ అధ్యక్షులు సంబు శ్రీనివాసులు అన్నారు మంగళవారం బిజినేపల్లి మండల కేంద్రంలోని యుపిఎస్ ప్రభుత్వ పాఠశాలకు మంచినీటి ట్యాంకును అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల సంక్షమానికి నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలలో నైపుణ్యం సంపాదించి పేరు ప్రతిష్టలు సంపాదించడంతోపాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ప్రతిభను గుర్తించి బహుమతి అందించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంబు పాండు కోశాధికారి ఆకుతోట నాగరాజు తోపాటు గంధం వెంకటేష్ రమణ తోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## జాతీయ బీసీ జనసేన కమిటీల ఎంపిక





**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 7 :–** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోజాతీయ బిసి జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో అధికారికంగా పలువురిని పదవులలో నియమించినట్లు ఆయన మీడియా కు ఓ ప్రకటనలో తెలిపారు ఇందులో భాగంగా జాతీయ బీసీ జనసేన రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా మేకల వెంకటేష్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడిగా బోయ చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా మేళగొని నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కాటామ్ భాగ్యలక్ష్మ గౌడ్, షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా జక్కుల జలజ, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలిగా అరుణ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు గా గడ్డమీది రమేష్, షాద్ నగర్ పట్టణ ఉపాధ్యక్షులుగా రాములు గౌడ్, జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడు గా వినయ్ కుమార్, నియోజకవర్గ అధికార మహిళా ప్రతినిధిగా స్రవంతి రాజ్ తదితరులను నియమించినట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా నూతనంగా నియమించబడిన సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## ఆలూరు సమీపంలో రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సు టయోటా ఫార్చునర్ కారు ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం**




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 7:–** రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండలం ఆలూర్ గేట్ సమీపంలోని మరో బస్సు ప్రమాదం జరిగింది టయోటా ఫార్చునర్ టర్న్ వెనుక నుండి బలంగా ఢీకొనడంతో ముందు వెళ్తున్న టిప్పర్ లారీని ఢీకొన్న టయోటా ఫార్చునర్ కారు బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యనికి కారణం అతివేగమే అని సమాచారం అందినది సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుకున్నట్లు తెలిపారు ఈ మధ్యకాలంలో నిరంతరం బస్సు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి నిన్న పరిగి డిపోకు చెందిన బస్సు రంగాపూర్ సమీపంలోని అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొన్నది ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యంపై దృష్టి సారించి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## ఎంపీడీవోను మర్యాదపూర్వక కలుసుకున్న అయ్యవారిపల్లి సర్పంచ్ గోటిక గోపాల్ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 7:–** రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బన్సీలాల్ ను అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ గోటిక గోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు సర్పంచ్ గోపాల్ రెడ్డి తో పాటు ఉప సర్పంచ్ సీమల మల్లేష్, వార్డు మహిళా సభ్యురాలు మంజులా రెడ్డి ఆయనతో ఉన్నారు ఈ సందర్భంగా ఎంపీడీవో బన్సీలాల్ ను పూలదండ శాలువాలతో ఘనంగా సత్కరించారు అదేవిధంగా మండలంలోని ఎంపీఓ అదేవిధంగా కార్యనిర్వాహణాధికారి తదితరులను వారు మర్యాదపూర్వకంగా సన్మానించారు ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అధికారికంగా ధనవంతుడు సహకారం అందించాలని సర్పంచ్ గోపాల్ రెడ్డి అధికారితో కోరారు ఈ సందర్భంగా ఎంపీడీవో బన్సీలాల్ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు మండలంలో ఏకైక ఏకగ్రీవ సర్పంచుగా రికార్డు సృష్టించారని గోపాల్ రెడ్డిని అభినందించారు ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ముజాఫిర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 9న రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు



నారాయణపేట జనవరి 7:( స్కై న్యూస్) రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల ఆదేశం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ ఆదేశాను సారం ఈ నెల 9న విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు నారాయ ణపేట డి ఎం.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతీ య రోడ్డు భద్రత మాసో త్సవాలు 2026 సందర్భంగా నారాయణపేట డిపో పరిధిలో ఉన్న పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రోడ్డు భద్రత కుసంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు చిత్ర లేఖన,వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మీ పాఠశాలల్లో పోటీలు నిర్వ హించి మొదటి, రెండవ స్థానాలు సాధించిన వారిని ఆయా పాఠశాలల వారు ఆర్టీసీ నారాయణపేట డిపో కార్యాలయానికి అదే రోజు పంపాలని కోరారు.అన్ని స్కూళ్ల నుంచి వచ్చిన వాటి నుండి బెస్ట్ సెలెక్ట్ చేసి ప్రమా దరహిత వారోత్సవాల ముగింపు రోజు బహుమతు లు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

**ప్రజాఉద్యమాల్లో భారతగడ్డపై మరో వందేళ్లైనా అగ్రభాగానే ఉంటాం**

**జనబలంతో కొత్తగూడెం కార్పొరేషన్ల కైవసం చేసుకుంటాం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్_ సాబీర్ పాషా**

**ఐదో రోజు చుంచుపల్లి, కొత్తగూడెంలో జరిగిన సిపిఐ వందేళ్ల ప్రచార జాతా**

**సిపిఐ ప్రచారజాతాకు ఘన స్వాగతం**

**గౌతంపూర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ**





**కొత్తగూడెం జనవరి7( స్కై న్యూస్)::** స్వాతంత్రోద్యమం నుంచి పురుడుపోసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లైనా ప్రజాదనరాన తగ్గకుండా అజేయంగా నిలిచిందని, ప్రజా ఉద్యమాలతో భారత గడ్డపై మరో వందేళ్లైనా వన్నె తగ్గనివ్వబోమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్_ సాబీర్ పాషా అన్నారు. సిపిఐ శతవసంతాళ ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మం నగరంలో జరగనున్న బహిరంగసభ సందర్భంగా చేపట్టిన ప్రచారజాతా బుధవారం చుంచుపల్లి మండలం, గౌతంపూర్ సింగరేణి ప్రాంతానికి చేరుకుంది. ప్రచారజాతా బృందానికి సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. గౌతంపూర్ నుంచి రుద్రంపూర్, రామవరం, కొత్తగూడెం పోస్టాఫీసు మీదుగా చుంచుపల్లి మండలపరిధిలోని విద్యానగర్ వైపాస్ సెంటరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లలో జరిగిన సభల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి, ప్రచారజాతా బృందం నాయకులు ఎస్_ సాబీర్ పాషా మాట్లాడుతూ వందేళ్లుగా ప్రజలతో మమేకమై ప్రజాపోరాటాల్లో మడమతిప్పబోమని అదే సిపిఐకి బలమన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి అనేక చట్టాలు సిపిఐ పోరాట ఫలితాలేనన్నారు. జిల్లాలో భూపోరాటాలకు నాంది పలికి పేదలకు గూడు కల్పించామని తెలిపారు. పోడు సాగుచేసుకుంటున్న పేదలపక్షన పోరాడి భూములపై హక్కు కల్పించామన్నారు. రైతు, యువజన, విద్యార్థి, మహిళా ఉద్యమాలతో ప్రజలకు మరింత చేరువయ్యామన్నారు. నియోజకవర్గంలో సిపిఐకి తిరుగులేదని త్వరలో జరగనున్న కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయదుందుభి మ్రోగిస్తామని స్పష్టం చేశారు. జాతా సందర్భంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, శేషగిరిరావు, బందెల నర్సయ్య, డాక్టర్ జయశంకర్, తెలంగాతల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు, తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, సారెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మ కుమారి, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జి.వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, ఫహీమ్, వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జున్ రావు, భూక్యా శ్రీనివాస్, నిమ్మల రాంబాబు, పాటి మోహన్ రావు, కొత్తూరు రవి, సుధాకర్, వాడే రాములు, నగేష్, గోపికృష్ణ, పెయ్యల రంగారావు, యూసుఫ్, ధర్మరాజు, బండి నర్సింహా, దుర్గ, సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు...

**23న స్వామివారి కళ్యాణం.**

**,25న రథోత్సవం . 27న ఉద్దాల సేవ.**

**దేవాలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి..**




**బిజినపల్లి జనవరి 7 (స్కై న్యూస్)** మండల పరిధిలోని పాలెం గ్రామంలో వెలిసిన శ్రీ అలెర్మెల్ మంగా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుండి 27 వరకు జరిగే పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాల పోస్టర్ కరపత్రికలను బుధవారం నాడు దేవాలయ కార్యాలయ ఆవరణ లో విడుదల చేశారు. ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి , కార్యనిర్వాన అధికారి సిహెచ్ రంగారావు లు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆలయంలో ఈనెల 20 నుండి 27 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20న ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈనెల 21న పాలెం పూర్వ విద్యార్థుల సమితి వారిచే మండల స్థాయి భాగవత పోటీలు,ఆలయంలో ప్రత్యేక హోమాలు,ఈనెల 22న మండల స్థాయి సుప్రభాత పోటీలు,గరుడ వాహన సేవ, ఎదుర్కొల్లు,ప్రత్యేక హోమ పూజలు ఈనెల 23న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం,ఈనెల 24న వెంకటేశ్వర స్వామి భజన మండలి వారిచే ఉమ్మడి జిల్లా స్థాయి భజన పోటీలు, హోమాలు ప్రత్యేక పూజలు,ఈనెల 25న ఆదివారం రథసప్తమి నాడు స్వామివారి రథోత్సవం తేరు ఊరేగింపు,ఈనెల 26న సోమవారం నాడు ఉద్దాల మహోత్సవం,పండితులకు సన్మానం,ప్రత్యేక హోమపూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపా కటాక్షలు పొందాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోనాసీ రామకృష్ణ, ఉప సర్పంచ్ శ్రీనివాసులు మాజీ మండల అధ్యక్షులు పి.శ్రీనివాస్ గౌడ్ ధర్మ మాజీ ధర్మకర్తలు గాడి సురేందర్,గంధం వెంకటేష్, ఆలయ పూజారులు రామానుజాచార్యులు, జయంత్,భక్తులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలలో పరిమితికి మించి ప్యాసింజర్లను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట జనవరి 7 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో రోజురోజుకు పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం వలన రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రజల ప్రాణాలు, భద్రత దృష్ట్యా ఈ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఆటోలు, ట్రాక్టర్లు, టెంపోలు, లారీలు, ప్రైవేట్ బస్సులు, స్కూల్ వాహనాలు తదితర అన్ని రకాల ప్రజా మరియు ప్రైవేట్ వాహనాలను క్షణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను తక్షణమే సీజ్ చేయడంతో పాటు, చట్ట ప్రకారం జరిమానాలు విధించి, సంబంధిత వాహనా యజమానులు పై( ఎఫ్ ఐ ఆర్) నమోదు చేస్తామని అలాగే మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (వీఎ×) అధికారులకు అప్పగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇకనుండి ఈ విధమైన తనిఖీలు నిరంతర కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం వలన వాహనాలపై నియంత్రణ కోల్పోయి ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో పాటు, అమాయక ప్రజల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందని ఎస్పీ గారు హెచ్చరించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రయాణించే వాహనాల విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

**వాహనదారులకు జిల్లా ఎస్పీ సూచనలు:**

వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి అనుమతించిన ప్రయాణికుల పరిమితిని కచ్చితంగా పాటించాలని డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫిట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫిట్ వంటి పత్రాలను చెల్లుబాటు అయ్యే విధంగా ఉంచుకోవాలని రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజా రవాణా వాహనాల్లో ప్రయాణించే వారు కూడా భద్రతా విషయాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదు, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదు, తప్పకుండా హెల్మెట్ సీట్ బెల్ట్ ఉపయోగించాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.

## యూరియా లభ్యతపై అపోహలు వద్దు రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ శాఖ అధికారులు



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 7 :–** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వ్యవసాయ సంచాలకులు రమాదేవి ఆధ్వర్యంలో కేశంపేట మండలంలో నేడు విత్తనాలు, ఎరువులు పురుగుమందుల లైసెన్సు కలిగిన డీలర్లకు యూరియా పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు యూరియా లభ్యత విషయంలో ఎలాంటి అపోహలను నమ్మవద్దని, ప్రభుత్వం ద్వారా సకాలంలో యూరియా సరఫరా జరుగుతుందని తెలిపారు మండలంలోని అధీకృత డీలర్ల వద్ద రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు పంట అవసరాన్ని బట్టి మాత్రమే యూరియాను వినియోగించుకోవాలని, అధిక మోతాదులో వాడటం వల్ల నేల సారవంతత తగ్గడమే కాక పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష కేశంపేట మండలానికి చెందిన లైసెన్సు పొందిన డీలర్లు పాల్గొని యూరియా పంపిణీ, నిల్వలు, రైతులకు సరైన మార్గదర్శకాలు ఇవ్వడంపై చర్చించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ జరిగేలా వ్యవసాయ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





**కొత్తగూడెం జనవరి 7( స్కై న్యూస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడిఓసి లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు, వాహనదారులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఉన్న గుంతలను వెంటనే గుర్తించి పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై గుంతలను పూడ్చే బాధ్యత సంబంధిత ప్రతి శాఖకూ ఉందని అన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటి నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ఇందుకు అనుగుణంగా బ్లాక్ స్పాట్ల మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం పట్టణంలో రైల్వే స్టేషన్ పరిసరాలు లక్ష్మీదేవిపల్లి మోర్ సూపర్ మార్కెట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే కొత్తగూడెం పట్టణంలోని ఫుట్‌పాత్‌ల వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న చిరు వ్యాపారులను అనువైన ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తగిన స్థలాన్ని గుర్తించాలని అన్నారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను మరమ్మత్తులు చేసి సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం జైలు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

## పక్షం రోజులుగా అంధకారంలో
# చేవెళ్ల హౌసింగ్ బోర్డు కాలనీ

**పట్టించుకోని మున్సిపల్ అధికారులు**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 7:–** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పక్షం రోజులుగా చీకటిలోనే మగ్గుతోంది కాలనీలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారులపై ఉన్న వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వీధి లైట్లు వెలగకపోవడంతోకాలనీ మొత్తం అంధకారంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రాత్రి సమయంలో రోడ్లపై నడవాలంటే భయాందోళనలకు గురవుతున్నామని, ముఖ్యంగా మహిళలు,వృద్ధులు,చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు చీకటివల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు చిన్న సమస్యను కూడా పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి తక్షణమే స్పందించి వీధి లైట్లను మరమ్మతు చేసి కాలనీలో వెలుగులు నింపాలని,ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

## వైదేహి నగర్ లో ఓపెన్ జిమ్ ను ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 7:–** రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం, వైదేహి నగర్ నార్త్ కాలనీలోని రోడ్ నెంబర్ 12 పార్కులో తెలంగాణ ప్రభుత్వం జిహెచ్ఎంసి నిధులతో మంజూరు చేయించి ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ పరికరాలను వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభోత్సవం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద రెడ్డి, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు, కార్యదర్శి రాజేందర్ రెడ్డి, లక్ష్మనారాయణ, వెంకట నరసింహారెడ్డి మూర్తి, వెంకటేష్ గౌడ్, చక్రధర్, వైదేహి నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి వెంకయ్య, సభ్యులు ప్రకాష్ బాబు, వేణుగోపాల్ శ్రీనివాసులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజాసేవలో ముస్లిం మైనారిటీ
# ప్రజాప్రతినిధులు ముందు ఉండాలి



**జోగులాంబ గద్వాల, జనవరి 7 (స్కై న్యూస్):** ఇటీవల ఎన్నుకోబడ్డ ముస్లిం మైనారిటీ సర్పంచు ఉపసర్పంచి వార్డు మెంబర్లు ప్రజా సేవలో ముందుండాలని హైకోర్టు న్యాయవాది మాజీ ఎంపీ లుగున బేగం, ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి జబ్బర్ అన్నారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గద్వాల్ పట్టణంలోని నల్లకుంట లో గల ఉర్దూఘర్ లో జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన సర్పంచులు, ఉపసర్పంచు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయవాది మాజీ ఎంపీ లుగునా బేగం ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి జబ్బర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గురించి వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను ప్రజలు విద్య,రాజకీయ, ఆర్థిక,సామాజిక రంగాల్లో ముందుండి మన బలహీన వర్గాల జాతి అభ్యున్నతికి కృషి చేయాలని ఆశిస్తూ... గ్రామ సర్పంచ్ – ఉప సర్పంచ్ ల విధులు గ్రామానికి అభివృద్ధి పరంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు సర్పంచులు నలుగురు ఉప సర్పంచులు 37 మంది వార్డు మెంబర్లను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికురు రెహ్మాన్, రహమతుల్లా, నస్రుల్లా, యూనిస్, షరీఫ్, ఎండి ఇస్మాయిల్, అక్రమ్, ఇలియాస్, వజీద్, జావిద్ ఇంతియాజ్, చాంద్ పాషా, సదాతుల్లా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను పరిశీలించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా జనవరి 7 రంగారెడ్డి** జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ శరవేగంగా పనులు కొనసాగుతున్నాయని సీఎం వచ్చి వెళ్లిన వెంటనే పనులు ప్రారంభమయ్యాయి అని గుర్తు చేశారు జరుగుతున్న పనులను చూడకుండా కనీసం తెలుసుకోకుండా శాసనమండలి సాక్షిగా కొందరు అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమన్నారు ఇకనుంచి దేని గురించి అయినా మాట్లాడేటప్పుడు ఒక్కసారి తెలుసుకొని ప్రతిపక్షలు మాట్లాడితే మంచిదని హితువు చెప్పారు అసెంబ్లీ అయిన శాసనమండలి అయిన ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పనులు చేయడానికి తప్ప అబద్ధాలు ప్రచారం చేయడానికి కాదని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఇంటిగ్రేటెడ్ పాఠశాల తెలంగాణ రాష్ట్రానికే అక్షర వన్నెలు తెచ్చి దేశానికే ఆదర్శంగా మారబోతుందని ఆయన ప్రశంసించారు త్వరలోనే ఈ పాఠశాల పనులు పూర్తి అవుతాయని, అన్ని వర్గాల ప్రజలకు ఈ పాఠశాల అందుబాటులోకి వస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు బాధ్యత గల ప్రతిపక్షం ప్రభుత్వానికి సరైన సూచనలు సలహాలు ఇవ్వాలని అంతేకానీ రాజకీయ లబ్ధి స్వప్రయోజనాల కోసం పాకులాడకూడదని హితవు పలికారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తీర్ణం చేపట్టి
# ప్రజల ప్రాణాలు కాపాడాలి

**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన ఆర్. ఎన్. రాము**



షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తీర్ణం చేపట్టకపోవడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ నేపథ్యంలో చౌరస్తా విస్తీర్ణంపై సంబంధిత అధికారులకు జ్ఞానోదయం కలగాలనే ఉద్దేశంతో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించిన ఆర్ ఎన్ రాము చౌరస్తాలోని డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రంతో కూడిన పూల దండను వేసి చౌరస్తా విస్తీర్ణం త్వరగా చేపట్టాలని ప్రార్థనాత్మకంగా విజ్ఞప్తి చేశారు ఈ నిరసన ద్వారా ప్రజా సమస్యను శాంతియుతంగా సృజనాత్మకంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆర్ ఎన్ రాము తెలిపారు ఇప్పటికే ఈ అంశంపై ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు ఇతర రాష్ట్రాలలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దేవాలయాలు విగ్రహాల వద్ద ప్రార్థనలు వినూత్న నిరసనలు చేపడుతున్న ఉదాహరణలను కూడా వారు గుర్తు చేశారు ఎన్ని విధాలుగా వినతులు చేసినా స్పందన లేకపోవడంతోనే ఈ విధమైన విచిత్రమైన అర్థవంతమైన నిరసనకు దిగాల్సి వచ్చింది అని స్థానికులు ఆర్ఎన్ రాము వ్యాఖ్యానించారు చౌరస్తా విస్తీర్ణం, మెయిన్ రోడ్ అభివృద్ధి వెంటనే చేపడితే ప్రమాదాలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని వారు తెలిపారు ఇప్పటికైనా సంబంధిత శాఖలు చొరవ తీసుకుని షాద్‌నగర్ చౌరస్తా విస్తీర్ణం ప్రారంభించాలని ప్రజల ప్రాణాలకు విలువ ఇవ్వాలని స్థానికులు ఆర్ ఎన్ రాము కోరుతున్నారు.

## పి ఎం శ్రీ ఫుట్బాల్ కప్ విజేత రాజాపూర్



**జడ్చర్ల, జనవరి 7(స్కై న్యూస్)** పి ఎం శ్రీ పథకంలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించినటువంటి వివిధ అంశాలలోని ఆటల పోటీల్లో రాజాపూర్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొని బాలుర విభాగంలో ఫుట్బాల్లో మొదటి స్థానంలో విజేతగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నాడు మహబూబ్నగర్లోని స్టేడియం గ్రౌండ్ లో నిర్వహించిన ఆటల పోటీలలో 24 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పి ఎం శ్రీ ఆటల పోటీలలో రాజాపూర్ విద్యార్థులు బాలుర విభాగంలో ఫుట్బాల్ ఫైనల్ కు చేరుకుని జట్టు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, చక్కటి సమన్వయంతో బాదేపల్లి బాయ్స్ హైస్కూల్ జట్టుపై గెలుపొంది ఫుట్బాల్ కప్ ను కైవసం చేసుకున్నారు. గెలుపొందినటువంటి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇబ్రహీం, ఫిజికల్ డైరెక్టర్ వెంకటమ్మ, స్పోర్ట్స్ కోచ్ ప్రకాష్, ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

## పెద్దాయన బాగున్నావా అంటూ వనమావద్దకి కారు దిగివచ్చిన కేటీఆర్

**ఉత్సాహంతో జై కొట్టిన టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు**

**కేటీఆర్ ని కలిసిన వనమా రాఘవేంద్రరావు**



**ఖమ్మం జనవరి 7( స్కై న్యూస్ );** జనవరి 7వ తారీకు కొత్తగూడెం తెలంగాణ భవన్లో గెలిచిన టిఆర్ఎస్ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి రావలసిన ప్రోగ్రాం కమ్మానికి మార్చడంతో టిఆర్ఎస్ నుంచి గెలిచిన కొత్తగూడెం సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు నెంబర్లు కార్యకర్తలతో మాజీ మంత్రి కేటీఆర్ కు స్వాగతం పలకడానికి వెళ్లిన వారికి ఆశ్చర్యకర సంఘటన చోటుచేసుకుంది.. మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు వనమా రాఘవేంద్రరావుని చూసిన కేటీఆర్ కారు ఆపి వారి వద్దకు వచ్చి యోగాక్షమాలు అడిగి తెలుసుకున్న మాజీ మంత్రి కేటీఆర్. మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ని ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా కూసుమంచి వద్ద భారీగా స్వాగతం పలికిన మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు వనమా రాఘవేంద్రరావు ను ఆప్యాయంగా పలకరించిన కేటీఆర్ బాగున్నారా పెద్దాయన అని కారు దిగి వనమా వెంకటేశ్వర వద్దకు వెళ్లి బాగున్నారా పెద్దాయన అంటూ యోగా క్షమాలు అడిగి తెలుసుకున్న కేటీఆర్. కేటీఆర్ఏ స్వయంగా కారు ఆపి వనమా పెద్దాయన వద్దకి దిగిరావడంతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. జై కేసీఆర్ జై కేటీఆర్ జై వనమా అంటూ ఖమ్మం పట్టణం మారుమోగిపోయింది. దీనితో బి ఆర్ఎస్ లో కొత్త ఉత్సాహాన్ని నింపినట్టు అయింది.

## శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధికి తరలి వెళ్లిన స్వాములు...



**నారాయణపేట జనవరి 7: (స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రం లోని శబరి పీఠం సన్నిధానం నుండి అయ్యప్ప స్వాములు శబరి కొండ వాసుడు శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణ చేపట్టిన స్వాములు బుధవారం గురు స్వాములు అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకర్ల భీమయ్య అప్పి స్వామి, అశోక్ గౌడ్, ఆధ్వర్యంలో పవిత్ర అయ్యప్ప స్వామి దివ్య దర్శనానికి తరలి వెళ్లారు. శబరి పీఠం సన్నిధానంలో అయ్యప్ప స్వాములు ఇరుముడలను కట్టుకొని శబరిలో వెలిసిన అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు తరలి వెళ్లారు. పట్టణంలో గురు స్వాముల ఆధ్వర్యంలో 41 రోజుల పాటు కఠోర దీక్షలు చేపట్టిన స్వాములకు ఇరుముడులు కట్టారు. అనంతరం స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి శబరి యాత్రకు తరలి వెళ్ళగా కుటుంబ సభ్యులు భక్తులు గ్రామ చివర వరకు వెళ్లి అయ్యప్ప దర్శనం దివ్యంగా జరగాలని ఆకాంక్షిస్తూ అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో స్వాములు జంగిటి వెంకటేష్ బాబు స్వామి జుట్టు శంకర్ బొంబాయి బాలాజీ కన్నయ్య లతోపాటు స్వాములు తరలి వెళ్లారు.

# ఏసీబీ వలలో నందిగామ
# ఎంపీడీవో సుమతి...

## ఎంపీవో తేజ్ సింగ్. ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్య అరెస్ట్
## లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయ్యారు





**రంగారెడ్డి, జనవరి 7(స్కైన్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో ఓ ఎంపీడీవో తనదైన స్టైల్ లో డబ్బులు డిమాండ్ చేసి అడ్డంగా ఏసీబీకి చిక్కిన ఘటన సంచలనం రేత్తిస్తుంది. జిల్లాలోని నందిగామ మండల ఎంపీడీవో సుమతితో పాటు మరో ఇద్దరు ఎంపీఓ తేజ్ సింగ్, ఈదులపల్లి గ్రామ కార్యదర్శి చెన్నయ్య, ఓ భవన నిర్మాణానికి సంబంధించి బుధవారంసాయంత్రం లంచం గా లక్ష రూపాయలు తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు దాడి చేసి హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ దాడి లో ఏసిబి డిఎస్పి ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత కారుకు కార్యాలయ విద్యుత్
### చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు.



**నాగర్ కర్నూల్ జనవరి 6( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయ సముదాయంలో రెవెన్యూ విభాగంలో ఒక సెక్షన్ సూపర్డెంట్ గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగురాలు సొంత ఎలక్ట్రికల్ కారుకు కార్యాలయం విద్యుత్తును ప్రతినిత్యం చార్జింగ్ కోసం వినియోగిస్తున్న పలు శాఖల అధికారులు చూస్తూ వెళ్తున్నారే తప్ప ఉన్నతాధికారులకు తెలపకపోవడం గమనార్హం. ప్రతినిత్యం కార్యాలయానికి వచ్చే పలువురు ప్రజలు ఈ సంఘటనను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. పలు కార్యాలయాలలో అనవసరంగా విద్యుత్తును వినియోగిస్తున్న సంఘటనలు వెలుగులోకి చూసిన ఇలాంటి ఎలక్ట్రికల్ కారు కూడా ఇంటి వద్ద చార్జింగ్ చేసుకొని రావాల్సిన మహిళా ఉద్యోగులు యదేచ్చగా కార్యాలయం విద్యుత్ వినియోగించుకోవడంపై చర్చ సాగుతుంది

# కలిసికట్టుగా ఉండండి అభివృద్ధి జట్టు కట్టండి..
### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 7:-** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు గా ఎన్నికైన ర్యాకల శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వెలజర్ల గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మండల సర్పంచులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో సన్మానించి పూల బొకేలు అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కలిసికట్టుగా ఉండండి మండలంలో అభివృద్ధి జట్టుగా కొనసాగండి అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నూతన సర్పంచులకు సూచించారు మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచులు సమైక్యతగా కలిసిమెలిసి అభివృద్ధి పనులు సాధించాలని ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లవేళలా అందుతాయని తెలిపారు రాజకీయాల పతీతంగా అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షంచారు నూతనంగా ఎన్నుకున్న మండల సర్పంచ్ల సభ్యులకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులకు ఆయన శాలువాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ అయ్యవారిపల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి, చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి, సిపిఐ సర్పంచ్ శీను నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానంపేట సురేష్ గౌడ్ పార్టీ సీనియర్ నేత బాదేపల్లి సిద్ధార్థ వెలీజర్ల కాంగ్రెస్ నాయకులు జంగారీ జంగయ్య జంగారీ రవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్పొరేటర్ కు
# 376 దరఖాస్తులు

**- డివిజన్లలో పర్యటనకు డీసీసీ టీమ్ లు**

**మహబూబ్ నగర్, జనవరి 7(స్కైన్యూస్):**కార్పొరేషన్లోని 60 డివిజన్లకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేయాలనుకునే అభ్యర్థులు వ్యక్తిగత వివరాలతో కూడిన దరఖాస్తులు అందజేయాలని ఈనెల 5న పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీసీసీ అధ్యక్షులు సూచించారు. డివిజన్లలో అభ్యర్థిగా పోటీచేయాలనుకునే ఆశావాహులు పోటాపోటీగా కార్యాలయంలో కోఆర్డినేటర్లకు దరఖాస్తులు అందజేశారు. చివరిరోజు బుధవారం సాయంత్రం వరకు 5 గంటల వరకు 60 డివిజన్లకుగాను 376 దరఖాస్తులు వచ్చాయి.

**పర్యటనకు డీసీసీ టీమ్లు**

కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో డివిజన్లలో పార్టీ నాయకులు పర్యటించేలా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్




ముదిరాజ్ డీసీసీ టీమ్ లు ఏర్పాటు చేశారు. 1 నుంచి 12 డివిజన్లకు ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు ఏపీ మిథున్ రెడ్డి సాయిబాబా, ఖాజా ఆజ్మత్అలీ, 18 నుంచి 24 డివిజన్లకు ఆనంద్ గౌడ్, సిరాజ్ ఖాద్రీ, ఎన్ పీ వెంకటేశ్, ఫయాజ్ ఆహ్మద్, 25 నుంచి 30 డివిజన్లకు వినోద్ కుమార్, అమరేందర్ రాజు, బి. అనిత, ఆవేజ్ అహ్మద్, 37 నుంచి 48 డివిజన్లకు ఎం.సురేందర్ రెడ్డి, చంద్ర కుమార్ గౌడ్, బి.మధుసూదన్ రెడ్డి, రాములుయాదవ్, 48 నుంచి 60 డివిజన్లకు రాజేందర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, జహీర్ అఖ్తర్. వసంత... ఈ డీసీసీ టీమ్ లు నేటి (గురువారం) నుంచి ఈనెల 13వ తేదీ వరకు తమకు కేటాయించిన డివిజన్లలో పర్యటించనున్నారు. బూత్ స్థాయి కమిటీలు, కార్యకర్తలతో పార్టీ పరిస్థితి, అభ్యర్థుల వివరాలపై చర్చించి ఆయా డివిజన్లకు సంబంధించిన సమ్మగ్ర నివేదికను డీసీసీకి అందజేయనున్నట్లు సమాచారం.

# 8న దుప్పట్ల పంపిణీ...
### జె ఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ జమ్ముల సతీష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ జనవరి 7( స్కై న్యూస్)** ఈనెల 8న మండల పరిధిలోని గగ్గలపల్లి గ్రామంలో జెఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జె ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమ్ముల సతీష్ రెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు నిర్వహించే కార్యక్రమానికి గ్రామంలోని వృద్ధులు పాల్గొని సహాయాన్ని స్వీకరించాలని కోరారు కార్యక్రమానికి గ్రామంలోని యువకులు నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు

# శీతాకాలం.. గుండె పదిలం!



తీవ్రమైన చలివాతావరణం, ఆకస్మిక శీతగాలులు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ సీజన్‌లో గుండెపోటు కేసులు అత్యధికంగా నమోదవ్వటంతోపాటు గుండె సంబంధిత మరణాలు కూడా ఎక్కువగా కనిపిస్తుంటాయి. చలిగాలులు, జీవనశైలి మార్పులు గుండెపై ప్రభావాన్ని చూపిస్తాయి. చలివల్ల మనలో చురుకుతనం తగ్గటం, నిద్రమత్తు ఎక్కువగా ఉండటం, సోమరితనం, ఒకేచోట కదలకుండా ఎక్కువసేపు ఉండిపోవడంవల్ల గుండె ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ఈరోజు వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారికి గుండె సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా యువతలో గుండెపోటు సమస్యలకు శీతాకాలం ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. చలి, ఒత్తిడి, అనారోగ్యకరమైన అలవాట్లు మొదలైవి. శీతాకాలంలో గుండెపోటు రావడానికి కారణాలు అవుతున్నాయి. అతిచల్లదనంవల్ల శరీరం వెచ్చఉండటానికి రక్తనాళాలు ముఖ్యంగా కరోనరీ ఆర్టరీస్ (ధమనులు)సంకోచించడం, ఈ కాలంలో శరీర వ్యాయామం తక్కువయ్యి చెమట తక్కువగా ఉండటం వల్ల రక్తపరిమాణం పెరగటంతో రక్తపోటు అధికమవ్వడం, చలికి జీవక్రియ (మెటబాలిజం) నెమ్మదించడం, కొన్ని హార్మోన్ల ప్రభావంతో రక్తం గడ్డకట్టే స్వభావం ఎక్కువయ్యి గుండె సిరల్లో చిక్కుకొని రక్తప్రసరణను అడ్డుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాలు ఎక్కువ అవుతాయి. శీతాకాలం హృదయనాళ వ్యవస్థను అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది. అంతర్లీన గుండెజబ్బులు ఉన్నవారు ఈ సీజన్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వయో వృద్ధులు, హై బి.పి, షుగర్, ఇదివరకే గుండెజబ్బు ఉన్నవాళ్లు చాలాజాగ్రత్తగా ఉండాలి. 'కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉన్న వారిలో శీతాకాలంలో 'ఆంజినా'(ఛాతీ నొప్పి) తరుచూ వచ్చే అవకాశం ఉంటుంది. చల్లని వాతావరణంవల్ల రక్తనాళాలు కుచించుకుపోయి (వాసోకన్‌స్ట్రక్షన్), సహజ ప్రతిస్పందనవల్ల రక్త పోటు పెరగటం, గుండెకు ఆక్సిజన్ సరఫరా డిమాండ్ పెరగటం, శరీరానికి కావలసిన రక్తాన్ని గుండె సరిగా సరఫరా చెయ్యలేకపోవటం వల్ల గుండె వేగంగా కొట్టుకోవడం, గుండెపై ఒత్తిడి పెరిగి స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇంకొక సాధారణ సమస్య 'అరిథ్మియా'. ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల వల్ల, శీతాకాలంలో క్రమరహిత గుండె లయలు ఏర్పడుతాయి. చల్లనిగాలి గుండె విద్యుత్ వ్యవస్థను చికాకుపెడుతూ, దుర్బలవ్యక్తుల్లో అసాధారణ లయలు ఏర్పడుతాయి. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం, వేపుళ్లు, మసాలాలు ఎక్కువగా తినడం, అధిక ఒత్తిడి కూడా గుండెకు చేటుతెస్తాయి. శరీరం బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎందుకంటే, అధిక బరువువల్ల ముఖ్యంగా యువతలో హృదయ స్పందనరేటు పెరుగుతుంది తద్వారా గుండెపై భారం పడుతుంది. చలికాలంలో గుండె సమస్యలు ఇబ్బంది పెట్టకుండా ఎలా నిర్వహించాలి? శరీర ఉష్ణోగ్రతలు పడిపోకుండా వెచ్చని దుస్తులు ధరించాలి. నడక, యోగలాంటి స్వల్ప వ్యాయామాలు చెయ్యాలి. మెడిటేషన్ (ధ్యానం ) కూడా బాగా ఉపయోగపడుతుంది. పొగతాగడం, మద్యం మానెయ్యాలి లేదా బాగా తగ్గించాలి. పోషకాలు అధికంగా ఉండే తాజా ఆహార పదార్థాలు, పప్పుధాన్యాలు, పండ్లు, గింజలు, తృణధాన్యాలు మొదలైవి ఎక్కువగా తీసుకుంటూ, దాహం అనిపించకపోయినా మంచినీళ్లు బాగా (గోరువెచ్చగా) తాగాలి.దీనివల్ల ఆరోగ్యం ఆకస్మికంగా ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. గుండె వైఫల్యం చెందేవరకు మనం గమనించలేమని తెలుసుకోవాలి. వృద్ధులు, గుండెజబ్బులు ఉన్నవారు, అధికరక్తపోటు, మధుమేహం ఉన్న వారు, శరీరబరువు అధికంగా ఉన్నవారు, అతి బలహీనంగా ఉన్నవారు, మానసికంగా ఒత్తిడిలో ఉన్నవారు, ఆరుబయట ఎక్కువసేపు పని చేసేవారు, చలిప్రభావం వల్ల మాత్రమే అసౌకర్యంగా ఉండవచ్చని నిర్లక్ష్యం చెయ్యకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని, అవసరం అనిపిస్తే వైద్య సలహా తీసుకోవడం మంచిది. రక్తపోటు(బిపి), షుగర్, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తలతిరుగుతున్నట్లు అనిపిస్తే, ఎడమచేయి, మెడ, దవడతోపాటు వీపుకు ప్రసరించే నొప్పి, అసాధారణ అలసట, ఆకస్మిక బలహీనత, మైకంగా ఉండటంవంటి లక్షణాలు నిరంతరంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే సపంలోని వైద్యుడిని సంప్రదించండి. ఈ చిన్నమార్పులతో, శీతాకాలంలో గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అకాల మరణాలను కూడా నివారించవచ్చు !

# ఏసీబీ వలలో నందిగామ ఎంపీడీవో సుమతి, ఎంపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్య
### లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయిన అధికారులు






**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 7 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో ఓ ఎంపీడీవో తనదైన స్టైల్ లో డబ్బులు డిమాండ్ చేసి అడ్డంగా ఏసీబీకి చిక్కిన ఘటన సంచలనం రేత్తిస్తుంది నందిగామ మండల ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ్ సింగ్, ఈదులపల్లి గ్రామ కార్యదర్శి చెన్నయ్య, ఓ భవన నిర్మాణానికి సంబంధించి రూ. లక్ష రూపాయలు తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ సిబ్బంది రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న అధికారులు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి భౌతిక దేహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**చిన్నచింతకుంట జనవరి 7 (స్కై న్యూస్);** మధ్యప్రదేశ్ ఉజ్జయిని వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫర్దిపూర్ గ్రామానికి చెందిన యువకులు కావలి నరసింహ, కుర్వ శివ కుమార్ భౌతిక దేహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తో పాటు గ్రామ సర్పంచ్ శివకుమార్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు వెంకటేష్, ఎండి ఖాదర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# వాయు కాలుష్యంతో పుట్టబోయే బిడ్డ మెదడుపై కూడా ప్రభావం






వాయు కాలుష్యం కేవలం పెద్దలకే కాదు, గర్భంలో ఉన్న శిశువుల మెదడుపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గర్భిణులు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, బ్లాక్ కార్బన్ వంటి కణాలు బిడ్డ మెదడు ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తాయి. ఐక్యూ తగ్గడం, ఆటిజం వంటి న్యూరో డెవలప్‌మెంటల్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.కరోనా తర్వాత భారతదేశానికి ఎదురవుతున్న అతిపెద్ద ప్రమాదం వాయు కాలుష్యం అని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తుల సమస్యలే కాకుండా కళ్లు, గుండెతోపాటు మొత్తం శరీరానికి పెను ప్రమాదంగా మారుతుందని పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రంగా వాయు కాలుష్యం మన భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుందని పరిశోధకులు అంటున్నారు. ఢిల్లీ ఆస్పత్రిలో 20 నుంచి 30% వరకు ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేషెంట్లే ఎక్కువగా ఉన్నారని లెక్కలు చెబుతుండటం.. దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. అయితే.. ఈ వాయు కాలుష్యం వల్ల భూమిపైన జీవిస్తున్న మనకే కాకుండా.. భూమిపై అడుగు పెట్టబోయే పుట్టబోయే బిడ్డ మెదడును కూడా దెబ్బతీస్తుందని తాజా రిపోర్ట్స్ చెబుతున్నాయి. గర్భంతో ఉన్న మహిళలు వాయు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, ఫైన్ పార్టీకులేట్ మేటర్ బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు గర్భంలో ఉన్న శిశువు మెదడుకు ప్రమాదంగా మారాయి. గర్భధారణ సమయంలో హెయిర్ పొల్యూషన్ బారిన మహిళలు పడడం వల్ల అభివృద్ధి చెందుతున్న శిశువు మెదడు ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని లాండ్ సెట్ ప్లానిటరీ హెల్త్ జర్నల్ లో పబ్లిష్ అయిన ఒక అధ్యయనం పేర్కొంది. రెండు లేదా మూడు నెలల ప్రెగ్నెన్సీ సమయంలో ఈ ప్రభావం అధికంగా ఉండవచ్చని తెలిపింది. బార్సిలోనా లైఫ్ స్టడీ కోహట్ ఆధారంగా 754 గర్భిణీలపై వాయు కాలుష్య ప్రభావాలను పరిశోధకులు స్టడీ చేయగా స్పెషలైజ్డ్ అల్ట్రాసౌండ్ ద్వారా ఫీటల్ బ్రెయిన్ స్ట్రక్చర్లను విశ్లేషించారు. గర్భిణీ స్త్రీ వాయు కాలుష్యానికి గురైనప్పుడు నైట్రోజన్ డయాక్సైడ్, ఫైన్ పార్టీక్యులేట్ మ్యాటర్, బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు శిశువు మెదడుపై ప్రభావం చూపుతాయని వైద్యులు అంటున్నారు. గర్భిణీ స్త్రీ వాయు కాలుష్యం ప్రభావానికి గురైతే బిడ్డ మెదడు అభివృద్ధిపై ప్రభావంతో పాటు పుట్టిన తర్వాత ఐక్యూ లెవెల్ తగ్గే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. దీంతోపాటు ఆటిజం వంటి న్యూరో డెవలప్మెంటల్ సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు డాక్టర్ జి.లత ఎంబిబిఎస్, ఎండి.. వాయు కాలుష్యం వల్ల గర్భిణీ స్త్రీ ముందస్తు ప్రసవం అయ్యే ప్రమాదంతో పాటు ఆ సమయంలో పుట్టిన బిడ్డ మెదడు పూర్తిగా అభివృద్ధి కాకపోవడం.. అలాగే.. పలు అనారోగ్య సమస్యలు పెంచే అవకాశం ఉందని అంటున్నారు. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా ఆ ప్రాంతాన్ని పూర్తిగా అవాయిడ్ చేస్తే.. కొంత బెటర్ అని వైద్యులు సూచిస్తున్నారు.

## ఆత్మహత్యలకు డిప్రెషన్ మాత్రమే కారణం కాదా?



ఆత్మహత్య అనగానే సాధారణంగా అందరూ అది మానసిక ఒత్తిడి లేదా డిప్రెషన్ వల్ల జరిగిందని భావిస్తారు. లేదంటే సమాజం, కుటుంబ పరిస్థితులు అనేక కారణాలు ఉన్నాయని అనుకుంటారు. అయితే, సూసైడ్ చేసుకోవాలనే ఆలోచనల వెనుక ఉన్న షాకింగ్ నిజాన్ని తాజా పరిశోధనలు బయటపెట్టాయి. సాధారణంగా ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే, వారు తీవ్రమైన మనస్తాపంలో ఉన్నారని లేదా డిప్రెషన్‌తో బాధపడుతున్నారని మనం అందరూ అనుకుంటాం. “అంత కష్టం ఏం వచ్చిందో” పాపం అని బాధపడతాం. కానీ, యూనివర్సిటీ ఆఫ్ ఉతా హెల్త్ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనం ప్రకారం.. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన కేవలం మానసిక జబ్బుల వల్లే రాదని, దీనికి జన్యుపరమైన కారణాలు కూడా ఉండవచ్చని తేలింది. చాలా సందర్భాల్లో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తులకు ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నట్లు రికార్డుల్లో ఉండదు. వారు అంతకుముందు ఎప్పుడూ డిప్రెషన్‌కు గురైనట్లు లేదా చికిత్స తీసుకున్నట్లు ఆధారాలు కనిపించవు. ఇలాంటి వారిపై పరిశోధకులు దృష్టిసారించారు. సుమారు 2,700 మందికి పైగా మరణించిన వ్యక్తుల జన్యువులను విశ్లేషించగా, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. మానసిక సమస్యలు ఉన్నవారిలో కనిపించే జన్యువుల కంటే, ఎలాంటి ముందస్తు లక్షణాలు లేకుండా ఆత్మహత్య చేసుకున్న వారిలో జన్యువులు భిన్నంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అంటే, ఆత్మహత్య చేసుకునే ప్రమాదం అనేది డిప్రెషన్, యాంగ్జైటీ లేదా పీటీఎస్‌డీ వంటి సమస్యలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా కూడా పని చేయవచ్చు. ఇప్పటివరకు ఆత్మహత్యలను నివారించడానికి కేవలం డిప్రెషన్ తగ్గించే మందులు లేదా కౌన్సెలింగ్‌పైనే వైద్యులు ఆధారపడుతున్నారు. అయితే, కొంతమందిలో జన్యుపరంగానే ఈ రిస్క్ ఉన్నప్పుడు, దాన్ని గుర్తించడానికి వేరే మార్గాలు వెతకాల్సి ఉంటుందని ఈ స్టడీ చెబుతోంది. ఈ జెనెటిక్ రిస్క్ ఫ్యాక్టర్లను ముందుగానే గుర్తిస్తే, భవిష్యత్తులో ప్రాణాలు కాపాడేందుకు కొత్త రకమైన చికిత్సలు మరియు పరీక్షలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఆత్మహత్య అనేది కేవలం ఒక వ్యక్తి బలహీనత కాదు. దాని వెనుక అంతుచిక్కని సైన్స్ దాగి ఉంది. ఈ కొత్త ఆవిష్కరణలు మానసిక ఆరోగ్య రంగంలో సరికొత్త మార్పులకు దారితీయవచ్చు.

# జీవితంలో ఎదగాలనుకుంటున్నారా?



చేస్తున్న పనిలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అది అందుకు తగిన విషయాలపై దృష్టి సారిస్తేనే సాధ్యమవుతుంది. అయితే, చాలా మంది చాలా కాలంపాటు శ్రమించినప్పటికీ ఆశించినంత ఎదుగుదల ఉండదు. కొందరు మాత్రం తమ జీవితంలో ఉన్నతస్థాలను తక్కువ సమయంలోనే చేరుకుంటారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికే ప్రయత్నిస్తుంటారు. ఉద్యోగం, వృత్తి, వ్యాపారం చేసేది ఏదైనా అందులో ఎదగాలని తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటారు. అయితే, చాలా మంది చాలా కాలంపాటు శ్రమించినప్పటికీ ఆశించినంత ఎదుగుదల ఉండదు. కొందరు మాత్రం తమ జీవితంలో ఉన్నతస్థాలను తక్కువ సమయంలోనే చేరుకుంటారు. రు చేసే పనిని మొదట ప్రేమించడం అలవర్చుకోండి. అందులో ప్రత్యేకతను చూపండి. తోపాటు చాలా మంది ఉన్నప్పటికీ ప్రత్యేకతను చాటుకోండి. ఇది మిమ్మల్ని అందరిలో ముఖ్యమైన వ్యక్తిగా నిలబెడుతుంది. విజయగాథల నుంచి నేర్చుకోవడం కంటే రంగంలో వైఫల్య కథలను కనుగొని చదవండి. ఎందుకంటే, వైఫల్య కథల నుంచి నిజమైన పాఠాలు నేర్చుకుంటారు. ఎందుకు విఫలమయ్యామో తెలుసుకుంటే.. రు ఆ పొరపాట్లు చేయకుండా విజయ తీరాలకు చేరుతారు.లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా సరైన కార్యాచరణ ప్రణాళికతో పనిచేయడం వల్ల రు లక్ష్యాన్ని మరింత సులభంగా సాధించవచ్చు. రు సాధించాలని కలలు కంటున్న దానిపైనే పూర్తి దృష్టి సారిస్తే రు విజయం సాధిస్తారు. కలల్లో తేలుతూ ఉండటం కంటే నిజమైన జీవితంలో ఉన్న సమస్యలను మనం గ్రహించి వాటిపై తగిన స్పందించాలి. రు చదివిన పుస్తకాల నుంచి, వ్యక్తిగత, వృత్తి జీవితంలో పొందిన అనుభవాల నుంచి కొత్త విషయాలను నేర్చుకోవాలి. సమస్యలు ప్రతిచోటా ఉంటాయి కాబట్టి.. ఒత్తిడికి గురికాకుండా అక్కడివారిని అర్థం చేసుకోవడం, వారితో సంభాషించడం ద్వారా పురోగతిని సాధించవచ్చు. ప్రణాళికలకు సంబంధించిన విషయాలను కొన్నింటిని రహస్యంగా ఉంచాలి. తద్వారా ఇతరుల నుంచి రు గౌరవం పొందుతారు. రు చేస్తున్న ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలి. సాధన చేయాలి. అనేక ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు తెలుసుకుంటూ ఇతరుల కంటే ఎక్కువ నేర్చుకుంటూ ఉండాలి. వ్యక్తిగత క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యం. ఇది మొత్తం అభివృద్ధిని నిర్ణయిస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ నైతిక నియమాలను వదిలిపెట్టొద్దు. కు తెలిసిన వాటిని ఇతరులకు నేర్పించడం ద్వారా రు కూడా కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. రు చేపట్టిన ఏ పనినైనా 100శాతం కృషి చేస్తే పురోగతి సాధించడం సులభమవుతుంది. అదే సమయంలో తప్పు దిశలో వెళుతున్నామని తెలిస్తే వెనుకాడకుండా వెంటనే తిరిగి సరైన మార్గంలో వెళ్లడం ప్రారంభించాలి. ఇందుకు వెనకాడకూడదు. రంగంలోని గొప్పవారిని కలవడం, వారితో సమయం గడపడం ద్వారా వారి నుంచి రు స్ఫూర్తి పొందుతారు. ప్రతి ఉదయం డబ్బు, సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకు ప్రణాళికలు వేసుకోవాలి. శారీరక, మానసిక ఆరోగ్యం అనేది మన ఎదుగుదలలో కీలకం కాబట్టి వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. మనస్సుకు, శరీరానికి కాసేపు విశ్రాంతినిచ్చే అవకాశాన్ని పరిశీలించాలి. వీటన్నిటినీ క్రమం తప్పకుండా చేయడం వల్ల రు చేస్తున్న ఉద్యోగం లేదా వృత్తి, వ్యాపారం ఇలా ఏ రంగంలోనైనా పురోగతి సాధిస్తారనడంలో సందేహం లేదు.

# భారతీయులు ఆహారాన్ని వృధా చేస్తున్నారా?



ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఉన్నా, టన్నుల కొద్దీ ఆహారం వృధా అవుతోంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటున ఒక వ్యక్తి ఏటా 79 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నాడు. ఈ వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయి. రీసైక్లింగ్, అవగాహనతో వృధాను అరికట్టడం, స్థిరమైన భవిష్యత్తుకు కీలకం. ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఒకవైపు వేధిస్తుంటే, మరోవైపు టన్నుల కొద్దీ ఆహారం చెత్తబుట్టల పాలవుతోంది. తాజాగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ నివేదికలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ఒక వ్యక్తి సగటున ఏడాదికి 79 కిలోల ఆహారాన్ని వృధా చేస్తుండగా భారతీయులు కూడా ఈ విషయంలో తక్కువే కాదని నివేదిక స్పష్టం చేసింది. భారతదేశంలో సగటున ఒక వ్యక్తి ఏడాదికి 55 కిలోల ఆహార వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నాడు. ఇందులో మనం వండుకున్నాక మిగిలిపోయిన ఆహారం, కూరగాయల తొక్కలు, పాడైపోయిన పండ్లు వంటివి ఉన్నాయి. మన దేశ జనాభా దృష్ట్యా చూస్తే, ఇది పర్యావరణంపై ఎంతటి భారాన్ని మోపుతుందో అర్థం చేసుకోవచ్చు. అత్యధిక వ్యర్థాలు: మాల్దీవులు అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ఒక్కో వ్యక్తి ఏడాదికి ఏకంగా 207 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో ఈజిప్ట్ (163 కిలోలు), ఇరాక్ (143 కిలోలు), పాకిస్తాన్ (130 కిలోలు) ఉన్నాయి. అత్యల్ప వ్యర్థాలు: ఈ జాబితాలో రష్యా ఆదర్శంగా నిలుస్తోంది. రష్యాలో ఒక వ్యక్తి ఏడాదికి కేవలం 33 కిలోల వ్యర్థాలను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. కేవలం ఆహారమే కాదు ఇతర వ్యర్థాలను కూడా కలిపితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. భారత్‌లో ఒక వ్యక్తి రోజుకు సగటున 0.35 నుండి 0.6 కిలోల చెత్తను ఉత్పత్తి చేస్తున్నాడు. అంటే ఏడాదికి ఒక వ్యక్తి ద్వారా 125 కిలోల నుండి 200 కిలోల వరకు మొత్తం వ్యర్థాలు తయారవుతున్నాయి. దీనికి అదనంగా మారుతున్న టెక్నాలజీ వల్ల పాత సెల్ ఫోన్లు, వైర్లు వంటి ఈ-వ్యర్థాలు కూడా పెరిగిపోతున్నాయి. ఒక భారతీయుడు ఏడాదికి సగటున 2 కిలోల ఈ-వ్యర్థాలను సృష్టిస్తున్నాడు.

# బిజినెస్

## గిగ్ కార్మికుల సామాజిక భద్రతకు 90 రోజుల పని నిబంధన



కేంద్ర ప్రభుత్వం గిగ్‌వర్కర్లకు సంబంధించిన సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించేందుకు కొత్త ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందడానికి ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు లేదా ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద మొత్తం 120 రోజులు పనిచేయాలి. ఇటీవల గిగ్‌వర్కర్లు సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం ముసాయిదా నిబంధనలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఒక రోజుకు ఒక అగ్రిగేటర్ వద్ద పని చేసినా,ఆ రోజు మొత్తం ఒక రోజుగా పరిగణలోకి వస్తుంది. ఒక గిగ్‌వర్కర్ అగ్రిగేటర్ కోసం చేసిన పనికి ఆదాయం సంపాదిస్తే, వారు ఎంత సంపాదించారనే దానితో సంబంధం లేకుండా, ఆ రోజున వారు పనిలో చేసినట్లుగా పరిగణలోకి వస్తుందని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ముసాయిదా నిబంధనలకు సంబంధించి తుది నోటిఫికేషన్‌కు ముందు అభిప్రాయాలు చెప్పాలని కేంద్రం కోరింది. 30-45 రోజుల వ్యవధిలో అభ్యంతరాలు మరియు సూచనలను ఆహ్వానించింది. ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్‌లలోని అన్ని నిబంధనలను పూర్తిగా అమలు చేయాలనే కార్మిక మంత్రిత్వ శాఖ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. కాగా, ఇటీవల డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న గిగ్‌వర్కర్లు సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. సామాజిక భద్రత, మెరుగైన వేతనాలను వారు డిమాండ్ చేశారు. అలాగే, 10 నిమిషాల్లో డెలివరీ విధానాన్ని పూర్తిగా చేయాలని డిమాండ్ చేశారు.

## రష్యా నుంచి చమురు దిగుమతుల వివరాలు ఇవ్వండి

అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది ఈ నేపథ్యంలో రష్యా నుంచి వారంపాటు చేసిన కొనుగోళ్ల వివరాలను ఇవ్వాలంటూ దేశ రిఫైనరీలను కేంద్రం అడిగినట్లు సమాచారం. అలాగే అమెరికా నుంచి చమురు దిగుమతుల వివరాలను కూడా అడిగినట్లు తెలుస్తోంది. అమెరికాతో ట్రేడ్ డీల్‌కు సిద్ధమైన నేపథ్యంలో ఈ డేటా తీసుకుంటున్నట్లు ఆంగ్ల డియా కథనాలు వెల్లడించాయి. 2022లో ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించాయి. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో, మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి 40 శాతానికి చేరింది. దీనిపై అమెరికా, దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. రష్యా సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే భారత్‌పై 50 శాతం సుంకాలు వేసిన సంగతి తెలిసిందే. భారత్‌తో తన వాణిజ్య లోటును తగ్గించుకోవాలని చూస్తోన్న యూఎస్‌ఏ.. వాణిజ్య ఒప్పందం చర్చల్లో భాగంగా టారిఫ్‌ల ద్వారా భారత్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ పరిణామాల వేళ.. రష్యా, అమెరికా చమురు కొనుగోళ్లకు సంబంధించిన డేటాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ రిఫైనరీలను అడిగింది. ఈ సమాచారం ఇవ్వాలని పీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాతో చర్చల సమయంలో ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూసుకుంటుందని డియా కథనాలు పేర్కొన్నాయి.

# బంగారం, వెండి ధరలు మరింత పెరుగుతాయా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యూఎస్ సైన్యం వెనెజువెలా రాజధాని కారకాస్‌పై భారీ దాడులు చేసి, అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన సంఘటన ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి వంటి సేఫ్ హెవెన్ ఆస్తుల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



**బంగారం, వెండి ధరలపై ప్రభావం**

భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగినప్పుడు పెట్టుబడిదారులు బంగారం, వెండి వైపు మళ్లుతారు. ఈ దాడి కారణంగా అనిశ్చితి పెరిగి, సేఫ్ హెవెన్ డిమాండ్ పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుత ధరలు (జనవరి 4 నాటికి భారత మార్కెట్‌లో) 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1,35,800 నుంచి రూ.1,37,000 వరకు (ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ ప్రకారం) ఉంది. అలాగే 22 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర సుమారు రూ.1,24,500. ఇక వెండి కిలోకు సుమారు రూ.2,40,000 నుంచి రూ.2,46,000 వరకు ఉంది.

**మరింత పెరిగే అవకాశం**

నిపుణుల అంచనా ప్రకారం.. ఈ ఉద్రిక్తతలు కొనసాగితే బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్‌కు 4,380 నుంచి 4,500 డాలర్లకు చేరవచ్చు. భారత్‌లో 10 గ్రాముల ధర రూ.1,40,000 స్థాయిని తాకే అవకాశం ఉంది. వెండి ధరలు మరింత గణనీయంగా పెరిగి, అంతర్జాతీయంగా ఔన్స్‌కు 75-78 డాలర్లకు చేరవచ్చని అంచనా. ఇది సప్లై చైన్ డిస్టర్బెన్స్ (వెనెజువెలా ప్రాంత షిప్పింగ్ రూట్లు ప్రభావితం) కారణంగా కూడా జరుగవచ్చు. అయితే, ఈ పెరుగుదల తాత్కాలికమే కావచ్చు. ఉద్రిక్తతలు తగ్గితే ధరలు స్థిరపడవచ్చు లేదా కొద్దిగా పడిపోవచ్చు. 2026లో మొత్తంగా బంగారం ధరలు ఔన్స్‌కు 5,000 డాలర్లకు చేరే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# జియో 'కొత్త' ప్లాన్లు.. ఇక ఏడాదంతా సిమ్ యాక్టివ్

ముఖేష్ అంబానీకి చెందిన ప్రముఖ టెలికమ్ కంపెనీ రిలయన్స్ జియో.. ఎప్పటికప్పుడు చవక రీఛార్జ్ ప్లాన్లు, ఆఫర్లతో యూజర్లను ఆకట్టుకుంటోంది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల ప్లాన్లను అందుబాటులోకి తెస్తోంది. తాజాగా కొత్త సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రతి నెలా నంబర్ ను రీఛార్జ్ చేసుకునే టెన్షన్ లేకుండా ఏడాది పొడవునా సిమ్‌ను యాక్టివ్‌గా ఉంచుకునే ప్లాన్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..




**రూ.3,599 ప్లాన్**

ఈ ప్లాన్ 365 రోజుల వాలిడిటీతో వస్తుంది. ఒక్కసారి రీచార్జ్ చేసి వదిలేసే వారి కోసం ప్రత్యేకంగా ఈ ప్లాన్‌ను రూపొందించారు. ఇందులో ఏడాది పొడవునా పాన్-ఇండియా రోమింగ్ తో అపరిమిత వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. ప్రతిరోజూ 2.5 జీబీ హైస్పీడ్ డేటా.. అంటే మొత్తం 912.5 జీబీ డేటా లభిస్తుంది. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపుకోవచ్చు. 5జీ కవరేజీ ఉన్న ప్రాంతాల్లో అపరిమిత 5జీ డేటాను ఉపయోగించుకోవచ్చు. ఇక జియో టీవీ, జియోఏఐ క్లౌడ్, గూగుల్ జెమిని ప్రో సబ్ స్క్రిప్షన్ అదనపు ప్రయోజనాలు.

**రూ.3,999 ప్లాన్**

లైవ్ స్పోర్ట్స్ ను ఇష్టపడే వ్యక్తుల కోసం ఈ ప్లాన్ ప్రత్యేకంగా రూపొందించింది జియో. ఈ ప్లాన్ ప్రీమియం ఓటీటీ సబ్ స్క్రిప్షన్ ను అందిస్తుంది. వ్యాలిడిటీ 365 రోజులు. పాన్-ఇండియా రోమింగ్ తో అపరిమిత కాలింగ్ ఉంటుంది. ప్రతిరోజూ 2.5 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. 5జీ కవరేజీ ఉన్న ప్రాంతాలలో అపరిమిత 5జీ డేటాను ఆనందించవచ్చు. ఫ్రీ ఫ్యాన్ కోడ్ యాప్ ఇందులో లభించే ఓటీటీ బెనిఫిట్. అదనపు ప్రయోజనాల విషయానికి వస్తే జియో టీవీ, జియోఏఐ క్లౌడ్, గూగుల్ జెమిని ప్రో వంటివి లభిస్తాయి.

**రూ .1,748 ప్లాన్**

కాలింగ్ ఒక్కటే ఉంటే చాలు మొబైల్ డేటా అవసరం లేదు అనుకునే వినియోగదారులకు ఈ ప్లాన్ ఉత్తమమైనది. ఇందులో వ్యాలిడిటీ 336 రోజులు. అన్ని నెట్ వర్క్ లకు అపరిమిత కాలింగ్ చేసుకోవచ్చు. ఇది వాయిస్ ఓన్లీ ప్యాక్ కాబట్టి ఎలాంటి డేటా రాదు. 3,600 ఉచిత ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. జియోఏఐ క్లౌడ్, జియో టీవీలకు యాక్సెస్ పొందుతారు

# స్పోర్ట్స్

# టీ20 వరల్డ్‌కప్‌కు పాక్ జట్టు ప్రకటన.. ఎట్టకేలకు స్టార్ ప్లేయర్‌కు చోటు

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం 16 మంది సభ్యుల పాకిస్తాన్ ప్రొవిజనల్ జట్టును ఇవాళ (జనవరి 4) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా సల్మాన్ అఘా ఎంపికయ్యాడు. అతనికి డిప్యూటీని (వైస్ కెప్టెన్) ప్రకటించలేదు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ ఎట్టకేలకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. స్టార్ పేసర్ షాహీన్ అఫ్రిది సైతం ఈ జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, అతని ఫిట్‌నెస్‌పై అనిశ్చితి నెలకొంది. షాహీన్‌కు బ్యాకప్‌గా మరో పేసర్ హారీస్ రౌఫ్ ఎంపికయ్యాడు. షాహీన్ తాజాగా బిగ్‌బాష్ లీగ్‌లో ఆడుతూ మోకాలి గాయం బారిన పడ్డ విషయం తెలిసిందే. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ రీఎంట్రీ ఇవ్వగా.. వికెట్‌కీపర్ బ్యాటర్ మొహమ్మద్ రిజ్వాన్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. రిజ్వాన్ స్థానంలో ఉస్మాన్ ఖాన్ ప్రధాన వికెట్‌కీపర్‌గా ఎంపికయ్యాడు. మెయిన్ స్క్వాడ్‌ను శ్రీలంకతో టీ20 సిరీస్ తర్వాత (జనవరి 11) ప్రకటిస్తారు.



టీ20 ప్రపంచకప్ కోసం పాకిస్తాన్ ప్రొవిజనల్ జట్టు
- సల్మాన్ అలీ ఆఘా (కెప్టెన్)
- బాబర్ ఆజమ్
- షాహీన్ అఫ్రిది (ఫిట్‌నెస్ అనిశ్చితి)
- ఉస్మాన్ ఖాన్ (వికెట్ కీపర్)
- షాదాబ్ ఖాన్
- మొహమ్మద్ నవాజ్
- ఫహీమ్ అష్రఫ్
- హారిస్ రౌఫ్ (షాహీన్‌కు ప్రత్యామ్నాయం)
- ఫకర్ జమాన్
- మొహమ్మద్ వసీం జూనియర్
- నసీం షా
- అబ్దుల్ సమద్
- సాహిబ్‌జాదా ఫర్హాన్
- సైమ్ అయూబ్
- సల్మాన్ మీర్జా
- అబ్రార్ అహ్మద్

కాగా, టీ20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ గ్రూప్-ఏ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఈ గ్రూప్‌లోనే టీమిండియా కూడా ఉంది. ఇతర జట్లుగా యూఎస్‌ఏ, నమీబియా, నెదర్లాండ్స్ ఉన్నాయి. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌తో పాక్ తమ వరల్డ్‌కప్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. దాయాదుల సమరం ఫిబ్రవరి 15న కొలొంబో వేదికగా జరుగనుంది.

## టీ20 ప్రపంచకప్ కోసం బంగ్లాదేశ్ జట్టు ప్రకటన.. స్టార్ బ్యాటర్‌పై వేటు

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యుల బంగ్లాదేశ్ జట్టును ఇవాళ (జనవరి 4) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా లిట్టన్ దాస్ వ్యవహరించనున్నాడు. అతనికి డిప్యూటీగా (వైస్ కెప్టెన్) మొహమ్మద్ సైఫ్ హస్సన్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ఐర్లాండ్ సిరీస్‌కు దూరంగా ఉన్న పేసర్ తస్కిన్ అహ్మద్ రీఎంట్రీ ఇచ్చాడు. వికెట్ కీపింగ్, బ్యాటర్ జాకిర్ అలీ, బ్యాటర్ మహిదుల్ ఇస్లాం అంకోన్‌కు జట్టులో చోటు దక్కలేదు. ఫామ్‌లో ఉన్నా, స్టార్ బ్యాటర్ నజ్ముల్ హసన్ షాంటోపై వేటు పడింది. కాగా, ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు గ్రూప్-సిలో పోటీపడుతుంది. ఈ గ్రూప్‌లో వెస్టిండీస్, ఇటలీ, ఇంగ్లండ్, నేపాల్ మిగిలిన జట్లుగా ఉన్నాయి. ఈ టోర్నీలో బంగ్లాదేశ్ ఫిబ్రవరి 7 నుంచి తమ జర్నీ ప్రారంభిస్తుంది.



## బ్రూక్, రూట్ అర్ధ శతకాలు.. తొలిరోజు ఇంగ్లండ్‌దే ఆధిపత్యం..!




మెల్‌బోర్న్ టెస్టులో విజయంతో యాషెస్ సిరీస్‌లో బోణీ కొట్టిన ఇంగ్లండ్ సిడ్నీలోనూ జోరు చూపించింది. సిరీస్‌లో మొట్టమొదటిసారి ఆ జట్టు బ్యాటర్లు క్రీజులో నిలబడి తొలి రోజే ఆలౌట్ గండాన్ని అధిగమించారు. ఓపెనర్లు విఫలమైనా.. హ్యారీ బ్రూక్(78 నాటౌట్), జో రూట్(72 నాటౌట్)లు ఆస్ట్రేలియా బౌలర్లను ధీటుగా ఎదర్కొంటూ అర్ధ శతకాలు బాదారు. ఫలితంగా.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. సిడ్నీ టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ్ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్(72 నాటౌట్), హ్యారీ బ్రూక్(78 నాటౌట్)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు చెక్కుచెదరని ఏకాగ్రతతో క్రీజులో పాతుకుపోయి స్కోర్‌బోర్డును నడిపించారు. ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు. నాలుగో వికెట్‌కు 150 పరుగులు రాబట్టడంతో ఆసీస్ బౌలర్లు నీరుగారిపోయారు. రెండో రోజు కూడా ఈ ద్వయం సెంచరీలు సాధిస్తే ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచినట్టే. వరుసగా..పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓడిన ఇంగ్లండ్ సిరీస్‌ను కోల్పోయిన విషయం తెలిసిందే.




# మెగా బ్లాస్ట్..
# చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్ గారు' ట్రైలర్ విడుదల

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి, స్టార్ దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం ఈరోజు తిరుపతిలో గ్రాండ్‌గా విడుదల చేసింది. ట్రైలర్ అంతటా అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, చిరంజీవి టైమింగ్ హైలైట్‌గా నిలిచాయి. చిరంజీవి తన వింటేజ్ కామెడీ అండ్ యాక్షన్ మేనరిజమ్స్‌తో అభిమానులను అలరించారు. ఈ సినిమాలో మరో విశేషం ఏమిటంటే, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ట్రైలర్ చివరిలో వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశం థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం ఖాయమని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం అదిరిపోయింది.




## 'పుష్ప-2' రికార్డు దిశగా అడుగులు.. 800 కోట్ల క్లబ్‌లో 'ధురంధర్'!

బాలీవడ్ బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్' సృష్టించిన సునామీ ఇంకా ఆగడం లేదు. బాలీవుడ్ చరిత్రలో మరే ఇతర హిందీ సినిమాకు సాధ్యం కాని రీతిలో ఈ చిత్రం సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది. విడుదలైన ఐదో వారంలో కూడా మంచి కలెక్షన్లు సాధిస్తున్న ఈ సినిమా తాజాగా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రూ. 800 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టింది. దీంతో భారతీయ సినీ పరిశ్రమలో ఒక హిందీ సినిమా రూ. 800 కోట్ల మైలురాయిని అందుకున్న చిత్రంగా ధురంధర్ రికార్డులకెక్కింది. అలాగే ప్రస్తుతం బాలీవుడ్ మార్కెట్‌లో 'పుష్ప 2' (హిందీ వెర్షన్) అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు 'ధురంధర్' సాధిస్తున్న వసూళ్ల వేగాన్ని చూస్తుంటే అతి త్వరలోనే 'పుష్ప 2' లైఫ్ టైమ్ బిజినెస్ రికార్డును ధురంధర్ అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో హిందీ బెల్ట్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన నంబర్ వన్ చిత్రంగా అవతరించేందుకు 'ధురంధర్' కేవలం కొన్ని అడుగుల దూరంలోనే ఉంది.

# సత్య 'జెట్లీ' గ్లింప్స్ రిలీజ్.. ఈ సారి కామెడీ మామూలుగా ఉండదు!




'మత్తు వదలరా' సినిమాతో టాలీవుడ్‌లో ఒక కొత్త తరహా కామెడీని పరిచయం చేసిన కాంబో మళ్ళీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కమెడియన్ సత్య హీరోగా యువ దర్శకుడు రితేష్ రానా రూపొందిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'మేడిపండు చూడ మేలిమై యుండును..' అనే వేమన పద్యంతో ఈ గ్లింప్స్ ప్రారంభం అయ్యింది. ఒక ఫ్లైట్ హైజాక్ నేపథ్యంలో సాగే ఈ కామెడీ సన్నివేశాలు గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెన్నెల కిషోర్, సత్య మధ్య వచ్చే సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. "నువ్వు ఏ టైర్ హీరోవి?" అని వెన్నెల కిషోర్ వేసిన ప్రశ్నకు, సత్య తనదైన శైలిలో "నేను జనరల్ కంపార్ట్‌మెంట్ హీరోని" అంటూ సమాధానం ఇవ్వడం సినిమాపై అంచనాలను పెంచుతోంది. సత్య, రియా సింఘా, వెన్నెల కిషోర్, అజయ్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని నిర్మాత చెర్రీ తెలిపారు. 'మత్తు వదలరా' సిరీస్ తర్వాత వస్తున్న ఈ సినిమా, ప్రేక్షకులకు మరోసారి నాన్-స్టాప్ వినోదాన్ని పంచుతుందని దర్శకుడు రితేష్ రానా ధీమా వ్యక్తం చేశారు. ఇక వేసవి కానుకగా 'జెట్లీ' థియేటర్లలో సందడి చేయనుంది.

# బాలీవుడ్‌లోకి ఆది సాయికుమార్ 'శంబాల'.. హిందీ ట్రైలర్ రిలీజ్




టాలీవుడ్ యువ నటుడు ఆది సాయికుమార్ బాలీవుడ్ ఎంట్రీకి సర్వం సిద్ధమైంది. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ బడ్జెట్ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ 'శంబాల' హిందీ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే ఈ చిత్రం తెలుగులో విడుదలై మంచి హిట్ అందుకోవడమే కాకుండా రూ.20 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని హిందీలో విడుదల చేయబోతున్నారు మేకర్స్. తెలుగు నటులు వరుసగా పాన్ ఇండియా సినిమాలతో ఉత్తరాది ప్రేక్షకులను పలకరిస్తున్న తరుణంలో ఆది కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1980ల నాటి కథ. శంబాల అనే ఊర్లో ఓ ఉల్క పడుతుంది. ఆ ఉల్క పడిన నాటినుంచి ఆ ఊరిలో అన్నీ అపశకునాలు కనిపిస్తుంటాయి. దాంతో శాస్త్రాలను, దేవుళ్లనీ, దెయ్యాలనీ అమితంగా నమ్మే ఆ ఊరి జనం ఆ ఉల్కని 'బండ భూతం' అని పిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఉల్కని స్టడీ చేసుందుకు సైంటిస్ట్ విక్రమ్(ఆది సాయికుమార్) ఆ ఊళ్లోకి అడుగుపెడతాడు. అతను సైన్స్‌ని మాత్రమే నమ్ముతాడు. ఊరిజనాల నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలని అతని ఉద్దేశ్యం. ఆ ఉల్క పడిన నాటి నుంచి ఆ ఊరివాడైన రాములు(రవివర్మ) చిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. ఓ ఆవుకు పాలు పిండబోతే, పాలకు బదలు రక్తం కారుతుంటుంది. ఆ ఆవుని చంపితే కానీ ఈ ఊరికి పట్టిన అరిష్టం పోదని ఊరి జనాలు నిర్ణయించుకొని ఆ ఆవును చంపబోతుంటే విక్రమ్ అడ్డుకొని ఆ ఆవుని తనతోపాటు తీసుకెళ్తాడు. ఇక రాములు రోజురోజుకీ రాక్షసుడిలా మారుతుంటాడు. అడ్డొచ్చినవాళ్లందర్నీ చంపుకుంటూ పోతుంటాడు. ఓ దశలో విక్రమ్ మీదకు కూడా ఎగబడతాడు. తాడికి తెగబడతాడు. అసలు ఆ ఊళ్లో ఏం జరుగుతుంది? ఆ ఉల్క వెనుక ఉన్న కథేంటి? ఆ ఊళ్లో అలాంటి భయానకమైన సంఘటనలు జరగడానికి కారణమెవరు? సైన్స్‌ని మాత్రమే నమ్మే విక్రమ్ దేవుడ్ని మొక్కాడా? లేదా? ఈ ప్రశ్నలన్నిమటికీ సమాధానమే మిగతా కథ.



# పార్టీలకు పర్యాయపదంగా మారిన ఓర్రీ.. సెలబ్రిటీ సర్కిల్స్‌లో ఎందుకంత క్రేజ్?

ఓర్రీ అలియాస్ ఓర్హాన్ అవ్రతమణి పేరు ఇప్పుడు బాలీవుడ్ పార్టీ కల్చర్‌కు సరికొత్త గుర్తింపుగా మారిపోయింది. స్టార్స్, గ్లామర్ భామలు, యంగ్ హీరోలు ఎక్కడ కనిపిస్తే అక్కడ ఓర్రీ తప్పకుండా ఉంటాడన్న మాట వినిపిస్తోంది. సెలబ్రిటీ పార్టీల్లో అతడి హాజరు అంటే ఫన్, హడావిడి, అన్‌ఎక్స్‌పెక్టెడ్ మూమెంట్స్ ఉంటాయనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా ఉంది. ఓర్రీ కెరీర్ విషయానికి వస్తే.. రిలయన్స్ సంస్థలో జాబ్ చేస్తూనే, నైట్ పార్టీలతో మరో వైపు ఆదాయం సంపాదించడం అతడి ప్రత్యేకతగా చెప్పుకుంటారు. ఈవెంట్స్, ప్రైవేట్ పార్టీల్లో అతడి ప్రెజెన్స్‌కు భారీ డిమాండ్ ఉంది. ఒక్కో ఈవెంట్‌కు లక్షల రూపాయల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటాడన్న టాక్ చాలాకాలంగా నడుస్తోంది. ఉద్యోగం కంటే కూడా ఈవెంట్ల ద్వారానే ఎక్కువ సంపాదన ఉంటుందన్న ప్రచారం కూడా ఉంది. అసలు ఓర్రీకి ఇంత క్రేజ్ ఎందుకంటే.. అతడు ఉన్న చోట ఎప్పుడూ సరదా వాతావరణం ఉంటుంది. జనాలను ఆటపట్టించడం, సరదాగా టీజ్ చేయడం, కాస్త ఇర్రిటేట్ చేసినట్టే కనిపించినా చివరకు నవ్వులు పూయించడం అతడి స్టైల్. అందుకే పార్టీ క్రౌడ్స్ అతడిని తెగ ఇష్టపడతారనే మాట వినిపిస్తోంది. ఇటీవలి కాలంలో అతడి ఫ్యాషన్ సెన్స్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇక తాజాగా ఓ నైట్ పార్టీలో ఓర్రీ చేసిన పనికి అక్కడున్నవాళ్లంతా షాక్ అయినట్టు తెలుస్తోంది. సెల్ఫీల పేరుతో ఆడా, మగా తేడా లేకుండా అందరినీ హగ్ చేసుకుంటూ, కొందరికి స్వీట్ కిస్ ఇవ్వడంతో పార్టీలో చర్చనీయాంశంగా మారాడు. ఈ ఘటనలో తెలుగు నటుడు హర్షవర్ధన్ రాణే, నటి మౌని రాయ్ వంటి సెలబ్రిటీలు కూడా ఉన్నారట. కొందరికి ఇది ఫన్‌గా అనిపించగా, మరికొందరికి మాత్రం అనూహ్యంగా అనిపించిందని సమాచారం. ఇదిలా ఉండగా, ఓర్రీ త్వరలో నటుడిగా మారబోతున్నాడనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఇప్పట్లో అతడు పూర్తిగా ఇన్‌ఫ్లూయెన్సర్ కెరీర్‌పైనే ఫోకస్ పెట్టాడని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో నటనలోకి వస్తే హీరోగా కాకుండా, తనకు సెట్ అయ్యే క్యారెక్టర్ లేదా కామెడీ రోల్స్‌తో ఎంట్రీ ఇవ్వవచ్చని టాక్. మొత్తానికి, ఓర్రీ పేరు ఇప్పుడు సినిమాల కంటే పార్టీల్లోనే ఎక్కువగా వినిపిస్తోంది. సెలబ్రిటీ కల్చర్‌లో అతడు సృష్టిస్తున్న హడావిడి చూసి, రాబోయే రోజుల్లో అతడి క్రేజ్ ఇంకెంతవరకు వెళ్తుందో చూడాలని ఇండస్ట్రీ ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## వాయు కాలుష్యంపై కారణాలు గుర్తించండి..

ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్యాన్ని నియంత్రించాలంటే ముందుగా.. కాలుష్యానికి గల కారణాలు గుర్తించాలని సూచించింది. ఈ మేరకు వాయు కాలుష్యంపై ఏర్పాటైన క్యామ్ (కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్)కు ఆదేశాలు జారీ చేసింది. వాయు కాలుష్యానికి పరిష్కారాలు వెతకడానికి ముందు.. కారణాలు కనుగొనడంపై దృష్టి పెట్టాలని సూచించింది. ఢిల్లీలో వాయు కాలుష్యంపై దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సమస్యకు మూలాలు, కారణాలు కనుక్కోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నా లాభం లేదని అభిప్రాయపడింది. రెండు వారాల్లోగా వివిధ రంగ నిపుణులను గుర్తించి, వారితో చర్చించి, ఢిల్లీ వాయు కాలుష్యానికి గల కారణాలు తెలుసుకోవాలని ఆదేశించింది. వివిధ రంగాలకు చెందిన నిపుణుల్ని గుర్తించి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం, సరైన వివరాలు నమోదు చేయడం క్యామ్ బాధ్యత అని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాల్ని ప్రజలకు అందుబాటులో ఉంచి, జవాబుదారీతనాన్ని పాటించాలని సూచించింది. వాయు కాలుష్యంపై కోర్టుకు పూర్తి అవగాహన లేకపోవచ్చని, అయితే, నిపుణుల ద్వారా సరైన నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపింది. సమస్యలు గుర్తిస్తే, పరిష్కారం అదే లభిస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఎక్కువ వాయు కాలుష్యానికి కారణమవుతున్న వాటిని ముందుగా గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకెళ్లాలని, అయితే, క్యామ్ కు అంత తొందరేం కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఏటికేడు ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోతున్న విషయాన్ని గుర్తించాలని సూచించింది. కాలుష్యానికి కారణమవుతున్న నిర్మాణాలు, వాహనాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని కోరింది.

## భారత సైన్యం దెబ్బకు అప్పుడు అమెరికాకు పరుగుపెట్టిన పాకిస్థాన్...



భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ అమెరికాతో లాబీయింగ్ కోసం ప్రయత్నించింది. ఈ మేరకు 50కి పైగా సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన పత్రాలను ఉటంకిస్తూ ఓ జాతీయా మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ప్రభుత్వాధికారులు, చట్ట సభ్యులు, మీడియా సంస్థలతో పాక్ బృందాలు 50కి పైగా సమావేశాలు జరిపినట్లు సమాచారం. 60 మంది అధికారులు, మధ్యవర్తులకు ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్ చేశాయి. అమెరికా అధికారులతో వ్యక్తిగత సమావేశాలు కూడా నిర్వహించాయి. భారత సైనిక చర్యను ఆపే లక్ష్యంతో వాషింగ్టన్ జోక్యం చేసుకునేందుకు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన ఈ సమావేశాల్లో కశ్మీర్ అంశం, ప్రాంతీయ భద్రత, అరుదైన ఖనిజాలు, ద్వైపాక్షిక సంబంధాల గురించి కూడా చర్చించినట్లు తెలుస్తోంది. లాబీయింగ్ కోసం ఆ దేశం భారీగా ఖర్చు చేసిందని, ఆపరేషన్ సిందూర్ జరిగిన సమయంలో ఆ మొత్తం భారీగా పెరిగిందని అమెరికాలోని ఓ ప్రముఖ మీడియా సంస్థ పరిశోధనలో తేలినట్లు వెల్లడించింది. ట్రంప్ యంత్రాంగానికి మరింత చేరువయ్యేందుకు దౌత్య, వాణిజ్యపరమైన అంశాల్లో అనుకూల ఫలితాలు పొందేందుకు లాబియింగ్ సంస్థలతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

## యూపీలో 'ఎస్ఐఆర్'..



ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మొత్తం 15.44 కోట్ల మంది ఓటర్లలో 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు ఈసీ తెలిపింది. శాశ్వతంగా వలసపోయిన వారు, మరణించిన వారు, బహుళ రిజిస్ట్రేషన్లు వంటి కారణాల వల్ల ఈ తొలగింపులు జరిగాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ప్రస్తుతం 12.55 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించినట్లు ఆయన వెల్లడించారు. తొలగించిన 2.89 కోట్ల మందిలో 46 లక్షల మంది మరణించారని, 2.17 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని, 25.47 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు ఉత్తరప్రదేశ్‌లో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వివిధ కారణాల వల్ల ఓటర్ల తొలగింపుల అనంతరం ఆ సంఖ్య 12.56 కోట్లకు తగ్గింది. ఓటర్లు తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో యాప్ ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాను మార్చి 6న విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

## ముంబై, ఢిల్లీ నుంచి కోనసీమకు ఓఎన్జీసీ నిపుణుల బృందం

**మోరి:** కోనసీమలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా మలికిపురం మండలం ఇరుసమండలోని మోరి-5 డ్రిల్లింగ్ సైటులో సోమవారం భారీ స్థాయిలో అగ్నిజ్వాలలు ఎగిసిపడిన విషయం తెలిసిందే. ఆ అగ్నికీలలు సుమారు 25 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ మంటల్ని ఆర్పేందుకు ఓఎన్జీసీ నిపుణుల బృందం ముంబై, ఢిల్లీ నుంచి వస్తున్నట్లు అధికారి తెలిపారు. అయితే సోమవారంతో పోలిస్తే ఇవాళ కాస్త అగ్నిమంటల తీవ్రత తగ్గినట్లు తెలుస్తున్నది. మహారత్న కంపెనీ దీన్ని ఆపరేట్ చేయడం లేదు. అహ్మదాబాద్‌కు చెందిన డీప్ ఇండస్ట్రీస్ కంపెనీ ఈ వెల్‌ను ఆపరేట్ చేస్తున్నది. ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు అగ్నిమాపక సిబ్బంది నీటి గొడుగును తయారు చేసింది. కానీ ఇంకా కొంత వరకు జ్వాలలు వస్తూనే ఉన్నాయి. అయితే నిపుణుల బృందం వచ్చిన తర్వాత పరిస్థితిని అంచనా వేస్తారని, ఆ తర్వాత మంటల్ని ఆర్పే ప్రక్రియ చేపడుతారని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి తెలిపారు. ముంబై, ఢిల్లీ నుంచి నిపుణుల బృందం వస్తున్నట్లు చెప్పారు. అగ్నిజ్వాలలు ఎగిసిపడిన ప్రదేశం సమీపంలో ఉన్న సుమారు 600 మంది గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. డీప్ ఇండస్ట్రీస్ సంస్థ మోరి-5 వెల్‌ను గత ఏడాది నుంచి ఆపరేట్ చేస్తున్నది.

# పాలమూరు రంగారెడ్డి నిర్మాణంపై ఒక్కరోజు ప్రశ్నించనీ నాయకులు నేడు యాత్ర చేపట్టడం సిగ్గుచేటు

### కాలేశ్వర నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత పాలమూరుకు ఎందుకు ఇవ్వలేదు

### కర్వేన దగ్గర కుర్చీ వేసుకుని పూర్తి చేస్తామన్నారు ఎందుకు చేయలేదు....

### ప్రాజెక్టుల పేరుతో బి ఆర్ ఎస్ వాళ్లు విహారయాత్ర చేస్తుండ్రు

### నార్లపూర్ లో మోటారు ఆన్ చేసి ముఖ్యమంత్రి హెలికాప్టర్ హైదరాబాద్కు చేరే లోగా బంద్ అయింది

### ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి, జనవరి 7(స్పైన్యూస్ ):**పాలమూరు రంగారెడ్డి నిర్మాణం పై నేడు ఆపు సోపాలు పడుతూ యాత్ర నిర్వహిస్తున్న నాయకులు ఆనాడు_సిఆర్ ను పాలమూరు రంగారెడ్డి నిర్మాణం పై ఎందుకు ప్రశ్నించలేదని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. కాలేశ్వరం నిర్మాణం పై పెట్టిన శ్రద్ధ పాలమూరు రంగారెడ్డి నిర్మాణం పైన ఎందుకు పెట్టలేదని వారు నిలదీశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో భాగంగా కర్వేన రిజర్వాయర్ శంకుస్థాపన కార్యక్రమం అనంతరం భూత్పూర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పటి సి ఎం కే సి ఆర్ అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తో ప్రాజెక్టు దగ్గర కుర్చీ వేయి ఇక్కడే ఉండి పూర్తి చేసి పోతానని చెప్పి మీ ప్రభుత్వం అధికారం పోయే వరకు ఎందుకు పూర్తి చేయలేక పోయారని అన్నారు బుధవారం జిల్లా కేంద్రం లోని నందిని సులో గల ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తో కలిసి ఆయన మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో భాగంగా 2023 లో నార్లపూర్ దగ్గర ఒక మోటారు ఆన్ చేసి అక్కడి నుండి చెంబులతో నీళ్లను తెచ్చి ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రతి గుడి దగ్గర జలాభిషేకం కార్యక్రమం ను అప్పటి బి ఆర్ ఎస్ నాయకులు చేసారని నార్లపూర్ లో మోటారు ఆన్ చేసినంక హెలికాప్టర్ లో కే సి ఆర్ ఇంటికి వెళ్లే వరకు మోటార్ బంద్ అయ్యిందన్నారు.అధికారం పోయిన తరువాత రెండు సంవత్సరాలకు నిద్ర లేచిన కే సి ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు, ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి తట్టుకోలేక ఒక ప్రెస్ మీట్ పెట్టి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడి అసెంబ్లీ కి వచ్చి మూడు నిముషాలు ఉండి వెళ్లిపోవడం హాస్యాస్పదమన్నారు పది సంవత్సరాల కాలంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ను



పూర్తి చేయకుండా ఎందుకు పెండింగ్ లో పెట్టారని అధికారం లో ఉన్నప్పుడు అడుగలేక పదవి పోయిన తరువాత ప్రజలు తమను మరిచిపోతారని ఉమ్మడి జిల్లా మంత్రులు, మాజీ ఎమ్మెల్యే లకు పని పాట లేక ప్రాజెక్టు ల పేరుతో విహారయాత్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. బిలిరూ 27 వేల కోట్లు ఖర్చు పెట్టి పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టు లో తల తోక లేకుండా పనులు చేసారని ఒక ప్రాజెక్టు లో పని పూర్తి కాకముందే ఇంకో ప్రాజెక్టు కు టెండర్లు పిలిచి వారి కమిషన్లు దండుకున్నారన్నారు రూ 27 వేల కోట్లలో రూ 15 వేల కోట్లు పంపుల కోసం ఖర్చు చేసి కమిషన్లు జేబు నింపుకున్నారని చెప్పారు. మొత్తం 57 వేల కోట్లకు డిపి ఆర్ అనుమతి కోసం పెట్టినప్పుడు రూ 27 వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పనులు పూర్తి అయ్యాయని బి ఆర్ ఎస్ నాయకులు చెబుతున్నారు కదా ఎట్లా పూర్తి అయ్యినట్లు ఆ నాయకులే ప్రజలకు వివరించాలని సూచించారులిబి

**ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

రెండు సంవత్సరాలు నిద్ర పోయి సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి నిద్ర లేచి నీళ్ల దోపిడీ అని మాటలు మాట్లాడి అసెంబ్లీ కి వచ్చి తోలు తీస్తా అని కే సి ఆర్ ప్రెస్ మీట్ లో చెప్పి తీరా అసెంబ్లీ కి ఇలా వచ్చి అలా వెళ్లారని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు పాలమూరు జిల్లాలో గతంలో మంత్రులుగా ఎమ్మెల్యే లుగా పని చేసిన వాళ్లు విహారయాత్ర చేసి ఎక్కడో ఒక దగ్గర సమావేశం పెట్టి ఎప్పుడు మాట్లాడని వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారన్నారు. కృష్ణ నీటి, పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టు మీద విశ్లేషణ చేసిండు కాళేశ్వరం మాదిరిగా ఎంక్వయిరీ చేస్తాం అనే వరకు పారిపోయిండు ముందు మామా పారిపోయిండు తరువాత వాళ్లు పారిపోయరన్నారు కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి అభివృద్ధి పథంలో దూసుకుని పోతున్న విషయం ను చూసి ఓర్వలేక అక్కడ ముఖం లేక పారిపోయి బయటకు వచ్చి ఎం చెబుతున్నారుంటే స్పీకర్ మైక్ కట్ చేస్తున్నారని చెబుతున్నారన్నారు. బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే లు చెబుతున్నారని తాము అధికారం లో ఉన్నప్పుడు ఒక్క రోజు కూడా మైక్ ఇవ్వలేదు కానీ మీ ప్రభుత్వం లో మాత్రం మైక్ ఇచ్చి మాట్లాడిస్తున్నారని చెబుతున్నారని ఆయన వివరించారు గ తం లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రతి పక్షలకు ఏనాడూ మాట్లాడానికి అవకాశం ఇవ్వలేదు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లో మీరు రండి మీ విలువైన సూచనలు ఇవ్వండి అని సి ఎం చెబుతున్నారని ఆయన గుర్తు చేశారులి 2003 ఆగస్టు 08 లో కాంగ్రెస్ ప్రభుత్వం జీవో తీసుకుని వచ్చింది పాలమూరు రంగారెడ్డి కు జూరాల ద్వారా 90 టి ఎం సి నీళ్లను మూడు లిఫ్ట్ 22 పంపుల ల ద్వారా 10 లక్షల ఎకరాలకు నీళ్లను ఇవ్వచ్చు అని ఉందని అలా కాకుండా నార్లపూర్ నుండి రంగారెడ్డి వరకు నీళ్లు కేవలం 70 టి ఎం సీలు అని ఆయన వివరించారు కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షలు శ్రీనివాస్ గౌడ్, మదనపురం మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు ప్రశాంత్, వనపర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత

కొంగొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టాం. కేంద్ర ప్రభుత్వం కూడా వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ బడ్జెట్‌పై మధ్యతరగతి ప్రజలు, రైతులు, యువత.. ఇలా ప్రతీ ఒక్కరూ కోటి ఆశలు పెట్టుకున్నారు. అదే సమయంలో నిర్మలమ్మ ప్రవేశపెట్టే ఈ బడ్జెట్ గురించి ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్రంగా చర్చ నడుస్తోంది.

**ఎందుకంత చర్చ..?**

ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. 2017 నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. అయితే, ఈ సారి ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం పడింది. దీంతో ఆ రోజు సెలవు కావడంతో బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అయితే, దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

**ఆదివారం కూడా పార్లమెంట్..**



అయితే, వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. 2016 తొలిసారి అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2025లో బడ్జెట్‌ను నిర్మలమ్మ శనివారం ప్రవేశపెట్టారు. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి. కరోనా సమయంలో (2020), అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012, మే13వ తేదీన ఆదివారం నాడు సభ జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు.

**ఫిబ్రవరి 1నే ఎందుకు..?**

పలు నివేదికల ప్రకారం.. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం భారత కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించు కునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తర్వాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించేవారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది.






VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137